


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL  ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి  శనివారం 09 ఏప్రిల్ 2022 సంపుటి: 03  సంచిక: 206  పేజీలు: 4  వెల: రూ 3-00


## పేదరికంతో చదువులు ఆగిపోకూడదు..
# అందరినీ చదివించండి: సీఎం జగన్



నంద్యాల: పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే అసలైన ఆస్తి చదువేనని, పేదరికం కారణంతో చదువులు ఎట్టిపరిస్థితుల్లో ఆగిపోకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నంద్యాల జిల్లాలో జగనన్న వసతి దీవెన రెండో విడత నిధుల విడుదల కార్యక్రమ సభలో విద్యార్థులు, తల్లులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పరిపాలన సంస్కరణలో భాగంగా ప్రతి పార్లమెంట్‌ను ఒక జిల్లాగా చేస్తానని, సుపరి పాలనను ప్రజలకు చేరవేస్తానని నంద్యాలలోనే మాట ఇచ్చాను. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ఇప్పుడు మళ్లీ మీ వాడిగా వచ్చానంటూ భావోద్వేగంగా ప్రసంగించారు సీఎం జగన్. పిల్లలకు మనం ఇచ్చే పెద్ద ఆస్తి.. చదువు. ఆ చదువు కోసం తల్లిదండ్రులకు అండగా ఉంటున్నాం. ఇంట్లో ఎంత మంది ఉన్నా పర్వాలేదు.. అందరినీ చదివించండి. తోడుగా మన ప్రభుత్వం ఉందని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు సీఎం వైఎస్ జగన్. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. పేదరికం కారణంగా చదువులు ఆగిపోకూడదు. చదువు అనే ఆస్తి ఇవ్వకుంటే పేదరికం నుంచి ఆ కుటుంబాలు బయటకు రాలేవు. ఆ బాధ్యతను కుటుంబ పెద్దగా తాను తీసుకున్నానని, జగనన్న వసతి దీవెన ద్వారా పిల్లలు, తల్లిదండ్రులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నామని తెలిపారు. చదువును తల్లిదండ్రులు ఆర్థిక భారంగా భావించకూడదనేది ఈ పథకం మరో ఉద్దేశమని తెలిపారు. చదువు కోసం దివంగత నేత వైఎస్సార్ హయాంలో పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇస్తే.. జగన్ అనే నేను ఆయన వారసుడిగా రెండు అడుగులు వేస్తున్నానని చెప్పారు. గత ప్రభుత్వం నీరుగారిస్తే.. తమ ప్రభుత్వం ఇప్పుడు సంక్షేమ పథకం ద్వారా మరింత మెరుగులు దిద్దామని తెలిపారు. తల్లులకు ప్రశ్నించే హక్కు వస్తుందని.. కాలేజీల్లో జవాబుదారీతనం పెరుగుతుందని అన్నారు సీఎం జగన్. విద్యాసంస్థల్లో వసతులు సైతం మెరుగుపడతాయని, బాగోలేకపోతే ప్రభుత్వం దృష్టికి ఆ తల్లులు తీసుకురావొచ్చని, అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. చదువుతో పాటు మంచి భోజనాన్ని సైతం పిల్లలకు అందించడం గర్వంగా ఉందని సీఎం జగన్ అన్నారు. బైలింగువల్ బుక్స్ ద్వారా క్రమక్రమంగా ఆంగ్ల మాధ్యమం వైపు నెమ్మదిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు సీఎం జగన్. తల్లులు బాగుంటేనే.. పిల్లలూ బాగుంటారన్న ఉద్దేశంతో ఖర్చుకు కూడా వెనకాడకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారాయన.

# నూతన మంత్రుల ప్రమాణ స్వీకారం..
## సీఎస్ కీలక ఆదేశాలు



అమరావతి: ఈ నెల 11వతేదీన జరగనున్నఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్ శర్మ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం నుండి నూతన మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై వీడియో సమావేశం ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ నూతన మంత్రివర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేయడంతో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల కార్యదర్శులను పోలీస్ శాఖ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. బ్లూబుక్ లోని నిబంధనల ప్రకారం నూతన మంత్రి వర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు సంబంధిత శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఐజీలు సి.త్రివిక్రమ వర్మ, రాజశేఖర్, సమాచార శాఖ సంయుక్త సంచాలకులు పి.కిరణ్ కుమార్ తదితరులుతో పాటు వీడియో సమావేశం ద్వారా గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ప్రోటోకాల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఇంకా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్డ్ లేకుండానే అన్ని ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రా: ఆర్బీఐ

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త ప్రతిపాదన చేసింది. కార్డ్ లేకుండానే అన్ని ఏటీఎంలలో నగదును విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నది. యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) విధానం ద్వారా ఏటీఎంల్లో నగదు తీసుకునే ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కార్డ్‌లెస్ విత్‌డ్రాలను కొన్ని బ్యాంకులు మాత్రమే కల్పిస్తున్నాయని, అయితే అన్ని బ్యాంకులు, ఏటీఎం నెట్‌వర్క్‌లో కార్డ్‌లెస్ విత్‌డ్రా అవకాశాన్ని కల్పించనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ద్రవ్య పరపతి విధాన ప్రకటనను ఆయన ప్రకటించారు. కార్డ్ లెస్ విత్‌డ్రా ద్వానా వినియోగదారుడు తన వద్ద డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేకున్నా ఏటీఎం నుంచి నగదును విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా కార్డ్ స్కిమ్మింగ్, కార్డ్ క్లోనింగ్ లాంటి చర్యలను కూడా అడ్డుకోవచ్చు అని ఆయన అన్నారు. క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల జారీని ఆపేది లేదని ఆర్బీఐ గరవ్నర్ తెలిపారు. ఆ కార్డులను కేవలం క్యాష్ విత్‌డ్రాల కోసమే కాదు అని, వాటిని రెస్టారెంట్లు, షాపులు, విదేశీ టూర్ల సమయంలో వాడుకునే వీలుందన్నారు. ఆ కార్డులను ఎప్పటికీ కంటిన్యూ చేస్తామన్నారు.



# ఎల్లో పార్టీ, మీడియాల కడుపు మంటకు మందే లేదు: సీఎం జగన్



నంద్యాల: పిల్లలకి ఇచ్చే చిక్కీపై సీఎం బొమ్మ ఉందంటూ చిల్లర రాజకీయాలతో రాద్ధాంతం చేస్తున్న ఘనత చంద్రబాబునాయుడు, ఎల్లో మీడియాదేనని ఎద్దేవా చేశారు సీఎం జగన్. నంద్యాల జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ప్రతీ ఇంటి మేనమామగా పిల్లలను చదివించే బాధ్యత తనదని మరోసారి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఎల్లో పార్టీ కడుపు మంట, అసూయకు మందే లేదని.. చివరికి పిల్లలకు అందుతున్న సంక్షేమ పథకంపై కూడా అక్కసు వెల్లగక్కుతున్నారంటూ జాలిపడ్డారు సీఎం జగన్. గత ప్రభుత్వం హయాలంలో తక్కువగా ఉన్నజీఈఆర్ రేషియో, ప్రభుత్వ బడులలో చదువుతున్న పిల్లల సంఖ్యను.. పెంచిన ఘనతను తమ ప్రభుత్వానిదేనని, ఇది గమనించమని ప్రజలను కోరారు సీఎం జగన్. నాడు-నేడుతో బడుల రూపురేఖలను మారుస్తూ.. సర్కారీ బడులకు మంచి రోజులు తీసుకొచ్చామని సీఎం జగన్ తెలిపారు. చేస్తున్న మంచేది ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, యెల్లో మీడియాకు పట్టట్లేదని, పార్లమెంట్ వేదికగా చేసుకుని కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు జేసేందుకు ప్రయత్నిస్తున్న గొప్ప ఘనత వాళ్లదన్నారు. ఎక్కడైనా ప్రతిపక్షాలు అనేవి రాష్ట్రం పరువు కోసం ఆరాటపడతాయని.. కానీ, మన రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యమైన ఏంటంటే.. ఇలాంటి ప్రతిపక్ష నేత.. ఆయన దత్త పుత్రుడు, యెల్లో మీడియాలు ఉండటం.. పరువు తీయడం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇవేవీ తనను బెదిరించలేవని, ప్రజల దీవెనలతో 'జగన్ అనే నేను' ఈ స్థానంలోకి వచ్చానని గుర్తు చేశారాయన. దేవుడి దయతో మరింత మంచి చేసే అవకాశం కలగాలని మనసారా కోరుకుంటున్నట్లు సీఎం జగన్ చెప్పారు.



## సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన టీటీడీ ఈవో జవహర్‌రెడ్డి

తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం క్యాంపు కార్యాలయంలో టీటీడీ ఈవో డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈవో డాక్టర్ రమణ ప్రసాద్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 15న జరగనున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కల్యాణ మహోత్సవం ఆహ్వాన పత్రికను సీఎం జగన్‌కు అందజేశారు. వేద పండితులు ముఖ్యమంత్రికి వేద ఆశీర్వచనం ఇచ్చి తీర్థ, ప్రసాదాలు అందించారు. కాగా 15వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 10 గంటలలోపు పున్నమి వెన్నెల్లో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం జరగనుంది.



## ట్రాఫిక్ హోంగార్డును సత్కరించిన హైకోర్టు చీఫ్ జస్టిస్

హైదరాబాద్ : తన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్న ఓ ట్రాఫిక్ హోంగార్డ్‌కు ఊహించని సత్కారం లభించింది. సాక్షాత్తూ తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ తన వాహనాన్ని ఆపి.. ఆ హోంగార్డుకు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ ఊహించని సన్మాన కార్యక్రమం అబిడ్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం ఆవిష్కృతమైంది. చీఫ్ జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ప్రతి రోజు తన అధికారిక నివాసం నుంచి హైకోర్టుకు అబిడ్స్ మీదుగా వెళ్తుంటారు. ఆ సమయంలో అబిడ్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ట్రాఫిక్ హోంగార్డ్ అష్రఫ్ అలీ(5066, అబిడ్స్ పీఎస్) విధులు నిర్వర్తిస్తుంటాడు. అష్రఫ్ తన విధులను చిత్తశుద్ధితో నిర్వహించడాన్ని చీఫ్ జస్టిస్ ప్రతి రోజు గమనించేవారు. ఈ క్రమంలో అతని పనితీరు పట్ల ఆకర్షితులైన సీజే సతీశ్ చంద్ర శర్మ.. శుక్రవారం ఉదయం తన కాన్వాయ్‌ను బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆపారు. హోంగార్డ్ అష్రఫ్ అలీకి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. అష్రఫ్ అలీ పనితీరును మెచ్చుకుంటూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశంసలు కురిపించారు.



# జగనన్న వల్ల అమ్మాయిలకు మంచి చదువు అందుతోంది..

నంద్యాల: ఉన్నత విద్యకు ఆలంబన లక్ష్యంతో పేద విద్యార్థుల చదువుకు ఫీజుల ఖర్చులను పూర్తిగా భరించడం. భోజన, వసతి ఖర్చులకు కూడా ఇబ్బంది పడకుండా ఉండేందుకు విద్యార్థుల కోసం ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. 'జగనన్న వసతి దీవెన' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం నంద్యాలలో 'జగనన్న వసతి దీవెన' పథకం కింద రెండో విడతలో 10, 68, 150 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి రూ. 1,024 కోట్ల రూపాయలను కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేశారు సీఎం జగన్. ఈ సందర్భంగా సభలో.. సీఎం జగన్ ఎదుట నంద్యాలకు చెందిన విద్యార్థిని కరణం బృహతి మానస మాట్లాడుతూ.. తాను శ్రీ రామకృష్ణ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్టు తెలిపింది. జగనన్న అందిస్తున్న వసతి దీవెన పథకం కింద ఏడాదికి రూ. 20 ఇవ్వడం తన లాంటి మధ్య తరగతికి చెందిన కుటుంబాల




అమ్మాయిలకు ఎంతో ఉపయోగపడుతోందని చెప్పింది. నవరత్నాల్లో భాగంగా విద్యా దీవెనను ప్రవేశపెట్టినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపింది. వసతి దీవెన పథకం వల్ల ఎంతో మంది విద్యార్థులు గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చి చదువుతున్నారని పేర్కొంది. ప్రభుత్వం అందించే రూ. 20వేల ద్వారా ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, హాస్టల్స్ చార్జీలు, పౌషికాహారం అందుతోందని సంతోషం వ్యక్తం చేసింది. అమ్మఒడి పథకం వల్ల తన తమ్ముడు శ్రీరామ చంద్ర బడిలో మంచిగా చదువుకుంటున్నాడని తెలిపింది. తన లాంటి ఎంతో మంది జగనన్న వల్ల ఈరోజు చదువుకుంటున్నారని చెప్పింది. కాగా, తన తండ్రి గుడిలో అర్చకులుగా ఉన్నారని.. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే వారికి జీతాలు డబుల్ అయ్యాయని.. దీంతో ఆర్థికంగా తన కుటుంబం నిలదొక్కుకుందని ఆనందం వ్యక్తం చేసింది.

## ముంబైని కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలని బీజేపీ కుట్ర చేస్తోంది : సంజయ్ రౌత్

కేంద్ర ప్రభుత్వంపై శివసేన ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముంబైని కేంద్ర పాలిత ప్రాంతం చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు కొందరు కేంద్ర హోంశాఖకు ఓ ప్రెజెంటేషన్ కూడా ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. బీజేపీ నేతలు కిరీట్ సోమయ్యతో సహా పలువురు నేతలు, బిల్డర్స్, వ్యాపారవేత్తలతో కూడిన ఓ బృందం ఈ కుట్ర వెనుక ఉన్నాయని రౌత్ సంచలన ఆరోపణలు చేశారు. ముంబైని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించే విషయంలో కొన్ని సమావేశాలు కూడా జరిగాయని, నిధుల సమీకరణ కూడా జరుగుతోందని అన్నారు. ఇలా.. ఓ రెండు నెలలుగా కొందరు ఇదే పనిలో నిమగ్నమయ్యారని మండిపడ్డారు. వీటికి సంబంధించిన పక్కా ఆధారాలు తన వద్ద ఉన్నాయని, ముఖ్యమంత్రి ఉద్ధవ్‌కు కూడా దీనికి సంబంధించిన సమాచారం అందిందని ఆయన వెల్లడించారు. ముంబైలో మరాఠీ ప్రజల శాతం తగ్గిందని, ఇదే విషయంపై బీజేపీ నేతలు కోర్టుకు వెళ్లి చెప్పడానికి రెడీ అవుతున్నారని, ఈ కారణంగానే ముంబైని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని వాళ్లు డిమాండ్ చేస్తారని రౌత్ ఆరోపించారు.



# సంపాదకీయం

శనివారం 09 ఏప్రిల్ 2022

## ప్లాన్ బీలో రష్యా అధ్యక్షుడు పుతిన్

రష్యా వెనక్కి తగ్గుతోందా ? రష్యా ఓటమి పాలైనట్లు భావించాలా ? రష్యా దూకుడు తగ్గించి? ఓ రకంగా ప్లాన్ బీ ద్వారా పరువు నిలుపుకోవాలని ప్రయత్నిస్తోందా ? అని ప్రశ్నిస్తే అవుననే అంటున్నారు అంతర్జాతీయ అంశాల విశ్లేషకులు. కేవలం రెండు, మూడు రోజుల్లో ఉక్రెయిన్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శించి.. ఆ దేశాన్ని చెప్పు చేతల్లో పెట్టుకోవచ్చని కలలు గన్న రష్యన్ ప్రెసిడెంట్ పుతిన్ఇపుడు పరువు దక్కించుకునే మార్గాన్ని అన్వేషిస్తున్నాడని అంటున్నారు విశ్లేషకులు. ఇదంతా ఎలా జరిగింది? ప్రపంచంలో మేటి సైనిక సంపత్తిని కలిగి వున్న రష్యా.. తమ సైన్యంలో పదోవంతు కూడా లేని ఉక్రెయిన్‌ని ఎందుకు ఓడించలేకపోయింది? ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ను అత్యంత సులువుగా స్వాధీనం చేసుకుని, తద్వారా ఉక్రెయిన్‌లో తమ చెప్పు చేతల్లో వుండే నేతను గద్దెనెక్కించి.. ఉక్రెయిన్‌ను గుప్పిట్లో పెట్టుకోవాలనుకున్న పుతిన్.. ఎందుకు తన లక్ష్యాన్ని 44 రోజుల యుద్ధంలో సాధించలేకపోయింది? యాక్షన్ ప్లాన్ పక్కాగా లేకపోవడం వల్లనే పుతిన్ తన లక్ష్యానికి దూరంగా వుండిపోయారు. ఉక్రెయిన్‌ను తక్కువ అంచనా వేయడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. అమెరికా సహా నాటో దేశాలు వ్యూహాత్మకంగా ఉక్రెయిన్‌కు అండగా నిల్వడం వల్లనే రష్యా తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.నిజానికి పుతిన్ ప్లాన్ ఏ కి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకున్నాడు. కేవలం రెండు, మూడు రోజుల్లో ఉక్రెయిన్ దేశాన్ని గుప్పిట్లోకి తెచ్చుకునేలా ప్లాన్ చేశాడు. అందుకు తగినట్లుగానే సైన్యాన్ని పంపాడు. వారికి కావాల్సిన ఆహారాన్ని, ఆయుధాలను పంపించారు. అయితే.. ఉక్రెయిన్ ప్రతిఘటన ఈ స్థాయిలో వుంటుందని ఊహించలేకపోయాడు పుతిన్. సుశిక్షితులు, దేశం పట్ల అంకితభావం కలిగిన ఉక్రెయిన్ సైనికులు తమకున్న పరిమిత స్థాయి ఆయుధాలతోనే రష్యన్ ట్యాంకర్లను, హెలికాప్టర్లను, తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను ఛేదించారు. వాటిని కూల్చేశారు. రష్యన్లు తమ టార్గెట్ చేరుకోలేకుండా దూరం చేశారు. అయితే.. ఇక్కడ నాటో దేశాల పాత్రను ప్రధానంగా చర్చించుకోవాలి. అమెరికా, బ్రిటన్ వంటి నాటో దేశాలు ఉక్రెయిన్ యుద్ధంలో డైరెక్టుగా రంగంలోకి దిగలేదు. అలా దిగితే అది అణు యుద్ధం వైపు, మూడో ప్రపంచ యుద్ధం వైపు దారి తీస్తుందని వాటికి తెలుసు. అందుకే వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. ఉక్రెయిన్‌కు తమ సైనికులను పంపలేదు. కానీ ఆయుధాలను పంపాయి. ముఖ్యంగా జావెలిన్, స్టింగర్ లాంటి ట్యాంకర్ ఛేదక మిస్సైల్స్‌ని అమెరికా ఉక్రెయిన్‌కు తరలించింది. అమెరికా వద్ద మొత్తం పది వేల జావెలిన్ మిస్సైల్స్ వుంటే అందులోంచి ఆరు వేల మిస్సైల్స్‌ని ఉక్రెయిన్‌కు పంపించింది. అందివచ్చిన అవకాశాన్ని ఉక్రెయిన్ సైనికులు సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు. జావెలిన్, స్టింగర్ మిస్సైల్స్‌తో రష్యన్ సైన్యం పని పట్టారు. రష్యన్ ట్యాంకర్లను మరీ ముఖ్యంగా కీవ్ నగరాన్ని స్వాధీనం చేసుకునేందుకు 65 కిలో మీటర్ల మేర తరలి వచ్చిన రష్యన్ ట్యాంకర్ల కాన్వాయ్‌ని తుత్తునియలు చేశారు. హెలికాప్టర్లను, తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను పెద్ద ఎత్తున కూల్చేశారునిజానికి పుతిన్ ప్లాన్ దారుణంగా విఫలమైందనే చెప్పాలి. ఈజీగా ఉక్రెయిన్‌ని ఓడిస్తామని అనుకున్న పుతిన్ ఒక్కసారి గత అనుభవాలను గుర్తు చేసుకుని వుండాల్సింది. 1905లో రష్యా, జపాన్ మధ్య యుద్ధం జరిగింది. అప్పట్లో జపాన్ రష్యా ముందు చాలా చిన్న దేశం. కానీ జపాన్ సైనికుల పోరాట పటిమ ముందు రష్యా నిలువలేకపోయింది. ఆనాటి యుద్ధంలో రష్యా ఓటమి పాలైంది. అదే విధంగా అమెరికా, వియత్నాం యుద్ధం అనుభవాన్ని రష్యా విస్మరించింది. అఫ్గాన్‌పై రష్యా పదేళ్ళపాటు యుద్ధం చేసినా గెలవలేకపోయింది. 1979లో చైనాను వియత్నాం ఎదిరించి నిలిచిన సన్నివేశాన్ని గుర్తు చేసుకోవాల్సింది. అంతకు ముందు రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అంటే 1945లో నియంత హిట్లర్‌ను రష్యా ఎలా నిలువరించిందో జ్ఞాపకం చేసుకోవాల్సింది. మరీ గతానికి వెళితే అంటే 1812లో నెపోలియన్ ఓటమిని చదవాల్సింది. ఈ అనుభవాలను పుతిన్ ఓసారి స్ఫురణలోకి తెచ్చుకుని వుంటే ఉక్రెయిన్ ఆక్రమణకు రంగంలోకి దిగేవాడే కాదేమో లేకపోతే.. కనీసం పక్కా ప్లాన్ అయినా రచించుకునేవాడేమోనని అంతర్జాతీయ అంశాల విశ్లేషకులు అంటున్నారు. ఇక్కడ మరో విషయం ప్రధానంగా చెప్పుకోవాలి. రష్యాకు ఇపుడు తమ మిత్రడెవరో.. తమతో టైమ్ పాస్ చేసే మిత్రులెవరో తెలిసి వచ్చిందని భావించాలి. ఉక్రెయిన్‌పై రష్యా ఆక్రమణ పర్వం మొదలు కాకముందు.. రష్యాతో చైనా, తద్వారా పాకిస్తాన్ సన్నిహితంగా మెదిలాయి. అందుకే యుద్ధం మొదలైన కొన్ని రోజులకే పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మాస్కో సందర్శించారు. ఇది రష్యా పట్ల మిత్రుత్వాన్ని ప్రదర్శిచడానికి ఏ మేరకు ఉపయోగపడిందో కానీ.. అమెరికా ఆగ్రహానికి మాత్రం గురయ్యాడు ఇమ్రాన్. తద్వారా తన పదవిని కోల్పోయే పరిస్థితి ఉత్పన్నమైంది. అటు చైనాకు రష్యా సన్నిహిత దేశాల జాబితా నుంచి వైదొలగినట్లయింది. ఉక్రెయిన్ విషయంలో పుతిన్ ప్లాన్ ఏ విజయవంతమైతే.. చైనా వెంటనే తన ప్లాన్‌ను అమలు పరిచేది. తైవాన్ దురాక్రమణకు రంగంలోకి దిగేది. ఇపుడు ఉక్రెయిన్ ప్రతిఘటన చైనాను సైతం తైవాన్ విషయంలో వెనుకంజ వేసేలా చేసింది. రష్యాకు అనుకూలంగా రంగంలోకి దిగేందుకు రష్యా సైనిక చర్య ప్రారంభానికి కేవలం 15 రోజుల ముందే రష్యా, చైనాల మధ్య పరిమితులు లేని వ్యూహాత్మక ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఆ మేరకు చైనా రష్యాకు అవసరమైన సమయంలో ఆయుధాలు, ఆహారం, యుద్ధరంగంలో అవసరమయ్యే వైద్యవసతులను సమకూర్చాల్సి వుంది. కానీ అమెరికా హెచ్చరికల ప్రభావంతో డ్రాగన్ కంట్రీ సరైన సమ యంలో వ్యూహాన్ని మార్చుకుంది. రష్యా దురాక్రమణను నేరుగా సమర్థించకు ఒడానే భారత్.. ఆదేశానికి సన్నిహిత దేశంగా మరోసారి నిరూపించుకుంది. నిజానికి రష్యా, భారత్ చిరకాల మిత్రులే. భవిష్యత్తులోను రష్యాతో సన్నిహిత సంబంధాలను మెయింటేన్ చేయాల్సిన అవసరం మనకుంది. 1971 ఇండో పాక్ యుద్ధసమయంలో రష్యా భారత్‌కు అండగా నిల్వడం వల్లనే మన దేశ విజయం సులభసాధ్యమైందన్న సంగతి విస్మరించలేం. అందుకే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉక్రెయిన్ పట్ల పూర్తి సానుభూతి ప్రదర్శిస్తూనే రష్యా చర్యను వ్యతిరేకించలేదు. ముఖ్యంగా ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన 22 వేల 500 మంది భారతీయులను సురక్షితంగా మనదేశానికి తరలించే విషయంలో మోదీ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అటు ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్‌స్కీతోను, ఇటు రష్యన్ ప్రెసిడెంట్ పుతిన్‌తోను టెలిఫోనిక్ సంభాషణలను జరుపుతూ కీలక సమయంలో కాల్పుల విరమణ పాటించేలా చేస్తూ.. ఉక్రెయిన్ పొరుగున వున్న పోలండ్, హంగరీ, స్లోవేకియా, రొమానియా దేశాలతో సంప్రదింపులు జరిపి.. మన ఎవాక్యుయేషన్ ఫ్లైట్స్ అక్కడి ఎయిర్ పోర్టుల్లో ల్యాండయ్యేలా.. భారతీయులకు ఉక్రెయిన్ సరిహద్దుల్లోనే ఎమర్జెన్సీ ఇమ్మిగ్రేషన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు.

## అనంతపురంలో బెర్తుల ఎవరికి

అనంతపురం, ఏప్రిల్ 8, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు దగ్గర పడే కొద్దీ ఆశావహుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. ఈ క్రమంలో అనంతపురం జిల్లా నుంచి మంత్రి వర్గ పోటీలో పలువురు రాజకీయ అగ్ర నేతలు ఉన్నారు. వారి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.. జిల్లాలో మంత్రి వర్గ రేసులో ప్రధానంగా ఏడుగురి పేర్లు వినిపిస్తున్నాయి. శంకరనారాయణను మంత్రి వర్గంలో ఉంచుతారా లేదా అన్నది ఒకటైతే.. ఉంచకపోతే కొత్తగా ఇద్దర్ని ఎవరు తీసుకుంటారనేది రెండో అంశం. శంకరనారాయణ రెండేళ్ల ట్రాక్ రికార్డ్ లో ఎలాంటి రిమార్బ్ లేవు. కానీ శంకరనారాయణను తొలగిస్తే అదే సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుంది. దీంతో ఉషాశ్రీ చరణ్ కు మంత్రి పదవి ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఆమెకు సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమవడం ఆందోళన కలిగిస్తోంది. మహిళ కోటా, కురుబ సామాజిక వర్గం అనే బలాలు ఉన్నా సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉంది.ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించి శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి దాదాపు మంత్రి పదవి ఖాయమనే టాక్ వినిపిస్తోంది. సీఎం జగన్ కు పద్మావతి భర్త సాంబశివారెడ్డి సన్నిహితుడు. కాబట్టి ఎస్సీ కోటాలో మంత్రి పదవి వస్తే పద్మావతికే అన్నది ప్రచారంలో ఉంది. కాకపోతే ఇక్కడ ఎమ్మెల్యే పై పెద్దగా కంప్లైంట్స్ లేకపోయినా చుట్టూ ఉన్న వారిపై చాలా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన సీఎం జగన్ కు సన్నిహితుడు. కష్టకాలంలో ఆయన వెంట ఉన్నారు. వివాదరహితుడు కావున ఆయనకు గ్యారెంటీగా మంత్రి పదవి అన్న టాక్ ఉంది. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్ గా ఉన్నారు. గాలి జనార్ధన్ రెడ్డికి అత్యంత సన్నిహితులు.ఇక రెడ్డి సమాజిక వర్గం విషయానికొస్తే ఇందులో సీనియర్ నేత అయిన అనంత వెంకట్రామిరెడ్డి పేరు ప్రముఖంగా ఉంది. ఆయన నాలుగు సార్లు ఎంపీ, ఒక సారి ఎమ్మెల్యే.. వివాద రహితుడు. జగన్ కు సన్నిహితుల్లో ఆయన కూడా ఒకరు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి.. ఆయన ఇప్పటికే ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచారు. రెండు రాష్ట్రాల్లో తరచూ ఆయన పేరు వినిపిస్తుంటుంది. డిఫరెంట్ వర్క్ స్టైల్ తో అందిరి దృష్టిలో ఆయన ఎప్పుడూ ఉంటారు. దీనికి తోడు వైఎస్ కుటుంబంతో నాలుగు దశాబ్దాలుగా అనుబంధం ఉంది.ఇక రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి.. రాష్ట్రంలో బలమైన గుర్తింపు ఉన్న పరిటాల కుటుంబంపై మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి 2019లో రికార్డు స్థాయి మెజారిటీతో గెలిచారు. ఈయన పేరు మంత్రి వర్గ రేస్ లో బలంగా ఉన్నా.. ఆయన సోదరులు చేస్తున్న పనులపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఇక చివరగా ఎమ్మెల్సీలకు ఇవాల్సి వస్తే ఇక్బాల్ పేరు ముందుగా ఉంటుంది. ఎందుకంటే ఆయన మాజీ ఐపీఎస్ ఆఫీసర్ గా పేరుంది. సీఎం జగన్ మొదటి నుంచి చాలా ప్రియార్టీ ఇస్తున్నారు. మైనార్టీ కోటాలో అంజాద్ బాషా స్థానంలో డిప్యూటీ సీఎం ఇస్తారనే టాక్ ఉంది.

## పాపికొండల్లో పులి జాడలు

కాకినాడ, ఏప్రిల్ 8, ఉభయగోదావరి జిల్లాల్లో విస్తరించిన పాపికొండల అభయారణ్యంలో పెద్ద పులి జాడలు కనిపించాయి. చిరుతల సందడిని గుర్తించారు. సుమారు 90 రోజులపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో వైల్డ్‌లైఫ్ అధికారులు పులుల గణన నిర్వహించారు. ఎక్కడెక్కడ ఏ జంతువులు ఉన్నాయనే సమాచారాన్ని రాబట్టారు. ఈ అభయారణ్యం పరిధిలో పెద్దపులి జాడలు కనిపించడం ఈసారి సాధించిన విజయం. ఈ సారి గణనలో అత్యంత విషపూరితమైన 30 అడుగుల గిరినాగు కూడా కంటపడింది. ఈ అభయారణ్యంలో కొండగొర్రెలు, పాంథర్, కొండచిలువలు, దుప్పులు, సాంబాలు, నక్కలు, ముళ్ల పందులు, ముంగిసలు, ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, అడవికుక్కలు, కుందేళ్లు, లేళ్లు, కనుజులు, అడవిపందులు తిరుగుతున్నట్లు గుర్తించారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 1012.858 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న అటవీప్రాంతాన్ని 2008లో కేంద్ర ప్రభుత్వం పాపికొండల అభయారణ్యంగా ప్రకటించింది. అప్పటి నుంచి అటవీప్రాంతంలోని జంతు సంరక్షణ కోసం అధికారులు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి జాతీయ పులుల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో గణన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇప్పటికే రెండుసార్లు పాపికొండల అభయారణ్యంలో పులుల గణన కార్యక్రమాన్ని వైల్డ్‌లైఫ్ అధికారులు నిర్వహించారు. మొదట్లో నిర్వహించిన సర్వేలో పులులు ఉన్నప్పటికీ కెమెరాకు చిక్కలేదు. ఈ సారి నిర్వహించిన సర్వేలో పులులు ట్రాప్ కెమెరాకు చిక్కాయి. పాపికొండల అభయారణ్యంలో పులుల గణనకు సంబంధించిన సర్వేను వైల్డ్‌లైఫ్ అధికారులు రెండు దశల్లో నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల్లో 90 రోజుల పాటు నిర్వహించిన ఈ సర్వేలో సుమారు 232 పైగా ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి జంతువుల్ని గుర్తించారు. మొదటి దశలో తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్న అటవీప్రాంతంలోని 71 చోట్ల 142 కెమెరాలను ఏర్పాటు చేసి 45 రోజుల పాటు సర్వే నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 45 ప్రాంతాల్లో 90 కెమెరాలు ఏర్పాటు చేసి 45 రోజుల పాటు సర్వే నిర్వహించారు. 2018లో నిర్వహించిన పులుల గణన సర్వేలో ఈ ప్రాంతంలో పులులు ఉన్నా ట్రాప్ కెమెరాకు చిక్కలేదు.

ఈ ఏడాది నిర్వహించిన సర్వేలో పులుల జాడ స్పష్టంగా కెమెరాకు చిక్కాయి. పూర్తి స్థాయిలో పులుల గణన వివరాలు జులై 29న వెల్లడించే అవకాశముంది. ప్రస్తుతం పాపికొండల అభయారణ్యంలో జరిగిన గణన వివరాల నివేదికను జాతీయ పులుల సంరక్షణ విభాగం(ఎన్‌టీసీఏ) కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ వివరాలను ప్రపంచ పులుల దినోత్సవం రోజైన జులై 29న పూర్తి స్థాయిలో ప్రకటిస్తారని వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు.పాపికొండల అభయారణ్యంలో పులుల గణన పూర్తయ్యింది. సుమారు 90 రోజుల పాటు నిర్వహించిన ఈ సర్వేలో పులులు, చిరుతలతో పాటు 230 రకాల పక్షులు, 14 రకాల జాతుల ఉభయచర జీవులు ఉన్నట్లు ట్రాప్ కెమెరాలు గుర్తించాయి. ఇక్కడ నిర్వహించిన సర్వే నివేదికను జాతీయ పులుల సంరక్షణ విభాగానికి పంపిస్తాం

## నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

ఏలూరు, ఏప్రిల్ 8, ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించుకొనేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2021 ఖరీఫ్ వరి నూర్పిళు మొదలైనప్పటి నుంచి రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ధాన్యం సేకరణకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్లో నమోదు ప్రక్రియను వారం రోజుల క్రితం ప్రభుత్వం నిలిపివేసింది. రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె)ల్లో నమోదు లేకపోవడంతో రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడం లేదు. ధాన్యం విక్రయించిన రైతులకు నగదు చెల్లింపుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఖరీఫ్ ధాన్యం నూర్పిళ్లు వేగవంతమయ్యే సమయంలో గత జనవరి 13, 17, 25 తేదీల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిశాయి. దీంతో, నల్లరేగడి భూముల్లో తేమ ఎక్కువైంది. ఖరీఫ్ వరి మాగాణుల్లో రబీలో సాగు చేసిన అపరాలు (మినుము, పెసర) పంటలు చేతికొచ్చాయి. అపరాలు నూర్పిడి పూర్తయ్యాక గత నెల 15 తర్వాత పలు ప్రాంతాల్లో వరి నూర్పిళ్లు ప్రారంభించారు. మార్చి 30న ధాన్యం సేకరణకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్‌బికెల్లో కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లను తొలగించింది. దీనికితోడు వ్యవసాయ శాఖ ఇ-క్రాప్ సైట్‌కు, ధాన్యం సేకరణ సైట్‌కు అనుసంధానంలో లోపాలు ఏర్పడడంతో పలువురి రైతుల పేర్లు ఆన్‌లైన్లో కనిపించడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు అవకాశం లేకపోవడంతో వరి కుప్పలు నూర్చేందుకు కొందరు రైతులు వెనుకంజ వేస్తున్నారు. మరికొంత ధాన్యం నూర్పిడి అనంతరం కళ్లాల్లో నిల్వ ఉండి పోయింది. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో 800, గుడివాడ డివిజన్ పరిధిలో 200 టన్నుల వరకు రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండిపోయినట్లు జిల్లా వ్యవసాయశాఖ నివేదిక సిద్ధం చేసి పౌరసరఫరాల శాఖకు పంపింది.ఇప్పటి వరకు జిల్లాలో 7.6 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. దీనికిగాను రైతులకు రూ.140 కోట్లు చెల్లించాల్సి ఉంది. తాజాగా ప్రభుత్వం ధాన్యం సేకరణ సైట్‌ను నిలిపివేసింది. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా, ఆచరణలో అమలు కావడం లేదు. 40 రోజులు దాటినా నగదు జమ కావడంలేదని రైతులు వాపోతున్నారు.

## దిగజారుతున్న నేతల వ్యాఖ్యలు....

గుంటూరు, ఏప్రిల్ 8, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ గొప్పగా మాట్లాడింది లేదు. ముఖ్యంగా తెలుగు దేశం పార్టీ నాయకుల గురించి ఆయన ఏనాడూ సంస్కారవంతమైన భాషను ఉపయోగించలేదు. చివరకు మంత్రులు సభలో, వినడానికి, రాయడానికి కూడా వీలులేని బూతులు మాట్లాడిన. మహిళలను అవమానపరిచే విధంగా ప్రత్యర్థులను వితంతువు, అనే అర్థం వచ్చే అసభ్యపద ప్రయోగం చేసినా, పగలబడి నవ్వారే కానీ, నిలువరించలేదు. అయితే, ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రాబాబు నాయుడు, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్’ను గురించి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చేసిన ‘దయ్యం’ వ్యాఖ్యలు ఆయన హోదాకున్న స్థాయిని దిగజార్చే విధంగా ఉందని అంటున్నారు. అదే విధంగా, చంద్రాబాబు, పవన్ కళ్యాణ్’ను ఉద్దేశించి, ‘ఆ ఇద్దరూ మనుషుల రూపంలో ఉన్న దెయ్యాలని’ చేసిన వ్యాఖ్యలు ఆ ఇద్దరూ కలిస్తే ఏమవుతుందో అనే భయం ఆయన్ని వెంటాడుతోందనే విషయాన్ని స్పష్టం చేసిందని, ఆ ఫ్రస్టేషన్’లోనే జగన్ దిగజారుడు వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనే కాదు సామాన్య ప్రజల్లో కూడా ఇదే విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. నర్సరావుపేటలో వాలంటీర్లకు సన్మానం పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, అదుపు తప్పి విపక్షాలపై విరుచుకు పడ్డారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఓ దొంగల ముఠా అన్నారు. హైదరాబాద్‌లో మకాం వేసి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. తాను మారీచులు.. రాక్షసులతో యుద్ధం చేస్తున్నానని చెప్పుకొచ్చారు. అయితే ఆయన అంతోటి ఆగ్రహానికి, కారణం లేక పోలేదు.అది కూడా ఆయనే చెప్పుకొచ్చారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని కలిసి వచ్చిన తర్వాత, కొన్ని మీడియా సంస్థలు, తమకున్న సమాచారం ఆధారంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రధాని ముఖ్యమంత్రికి క్లాస్ తీసుకున్నారని పేర్కొంటూ కథనాలు ప్రచురించాయి. ఇది ఆయన్ని ఆగ్రహానికి గురిచేసింది. మూడో మనిషి లేకుండా, తానూ, ప్రధాని ముఖాముఖీ జరిపిన చర్చల గురించి బయటి వారికీ తెలిసే అవకాశం లేదని, అందుకే ఆ మీడియా సంస్థలు చెప్పే వాటిని నమ్మనే నమ్మవద్దని ప్రజల్ని కోరారు. అయితే, ప్రధానితో ముఖాముఖీ జరిపిన చర్చల్లో ఏమి చర్చించారో, మాత్రం జగన్ రెడ్డి చెప్పలేదు. ఇలా, గుమ్మడి కాయ దొంగ ఎవరంటే బుజాలు తడుముకున్నట్లు ముఖ్యమంత్రి, పీఎం క్లాసు తీసుకున్న విషయాన్ని దాచేయడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి.నిజానికి, ఇలా ఇద్దరు ముఖ్య నేతలు కలిసి నప్పుడు ముఖ్యమంత్రి సొంత పత్రిక సాక్షి సహా అన్ని పత్రికలూ తమకున్న సమాచారం అదారంగా కథనాలు ప్రచురించడం కొత్త కాదు. నిజానికి ముఖ్యమంత్రికి ప్రధాని క్లాసు తీసుకున్నారు అనేది పూర్తిగా నిరాధారమైన వార్త కాదు. అంతకు కొద్దిరోజుల ముందే, శ్రీలంక పరిణామాల నేపధ్యంగా, ప్రధాని రాష్ట్రాల ఆర్థిక, స్థితి గతులు, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నవరత్నాల వంటి జనాకర్షక పథకాలు ఇత్యాది విషయాలపై సుదీర్ఘంగా, ఉన్నతాదికారులతో చర్చించారు. ఈ సందర్భంగా, అప్పుల్లో రెండవ స్థానంలో ఉన్న ఏపీ సహ మరికొన్ని రాష్ట్రాల్లో శ్రీలంక సంక్షోభాన్ని మించిన సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని, అధికారులు చేసిన వ్యాఖ్యలు, అందుకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను, తెలుగు పత్రికలే కాదు, దేశ విదేశీ పత్రికలు కూడా ప్రముఖంగా ప్రచురించాయి. ఈ నేపధ్యంలో ముఖ్యమంత్రి హఠాత్తుగా ఢిల్లీ వెళ్లి ప్రధానితో ముఖాముఖి చర్చలు జరిపినప్పుడు, ఇలాంటి కథనాలు రావడం సహజం. అందులో విశేషం లేదు. ఆగ్రహం చెందవలసిన అవసరం లేదు. అయితే, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా , కుటుంబ పరంగా అన్ని విధాల పరిస్థితులు అదుపు తప్పుతున్న నేపధ్యంలో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ఫ్రస్టేషన్’ లోకి జారు కుంటున్నారని, అందుకే చవాకులు, దూషణ, భూషణలకు దిగుతున్నారని, ఆయన సన్నిహిత వర్గాల నుంచి అందుతున్న సంచారాన్ని బట్టి తెలుస్తోందని అంటున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం ఒక్క ఏపీ విషయంలోనే కాదు, అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్ని రాష్ట్రాలను అదుపుచేసేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తోంది.ఇదేమి రహస్యమేమీ కాదు. మరో వంక అప్పులు లేకుండా రాష్ట్రంలో అమలులో ఉన్న ఓటుబ్యాంకు ఉచిత్ పథకాలు అమలు చేయడం అయ్యే పని కాదు. రాష్ట్ర సొంత ఆర్థిక వనరులు రోజు రోజుకు అడుగంటి పోతున్నవిషయం కూడా అందిరికీ తెలిసిందే.

## హార్డే... రోజుకు 55-60 లీటర్లు


తిరుపతి, ఏప్రిల్ 8, దేశంలో ఏటా అనేకమంది రైతులు వ్యవసాయంలో ప్రకృతి వైపరీత్యం వంటి అనేక కారణాలతో భారీగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రమంగా రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారిలో వ్యవసాయం చేయాలనే ఆసక్తి కూడా సన్నగిల్లుతుంది. దీంతో రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పుడిప్పుడే మెల్లగా ఇప్పుడు దీని ప్రభావం కనిపిస్తోంది.పాడి రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. పశువులను పెంచే వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారి కోసం ఈరోజు ఇతర జాతుల కంటే ఎక్కువ పాలను ఇచ్చే మేలైన జాతి ఆవు గురించి ఈరోజు తెలుసుకుందాం.. ఈ ఆవుల పెంపకంతో పశువుల యజమానుల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.గత కొన్నేళ్లుగా హార్ధేను ఆవును పెంచాలని నిపుణులు రైతులకు సలహా ఇస్తున్నారు. ఈ ఆవు ప్రత్యేకత ఏమిటంటే.ఇది రోజుకు 50-55 లీటర్ల పాలను ఇస్తుంది. దీనిని హర్యానాలోని లాలా లజపత్ రాయ్ యూనివర్సిటీ ఆఫ్ వెటర్నరీ అండ్ యానిమల్ సైన్స్ (లువాస్) శాస్త్రవేత్తలు మూడు జాతులను కలిపి తయారు చేశారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ హర్ధేను జాతిని ఉత్తర-అమెరికన్ (హోల్‌స్టెయిన్ ఫ్రిజ్న్), స్వదేశీ హర్యానా, సాహివాల్ జాతికి చెందిన క్రాస్ బ్రీడ్ నుండి ప్రత్యేకంగా తయారు చేశారు.హర్ధేను ఆవు గురించి చెప్పాలంటే, ఈ జాతికి పాల సామర్థ్యం ఇతర జాతుల ఆవుల కంటే ఎక్కువ. దీని పాల రంగు ఇతర ఆవుల కంటే తెల్లగా ఉంటుంది. ఇతర ఆవులు సగటున 5-6 లీటర్ల పాలు ఇస్తే, హర్ధేను ఆవు రోజుకు సగటున 15-16 లీటర్ల పాలను ఇస్తుంది. అయితే ఆవుకు తగిన పోషణ, మేత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే రోజుకు సుమారు 55-60 లీటర్ల ఇచ్చే పాల సామర్థ్యం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## ఆర్టీసీ బస్సుల్లోనే కొరియర్, కార్గో బుకింగ్

విజయవాడ, ఏప్రిల్ 8, ఏపీఎస్ ఆర్టీసీ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బస్సుల్లోనే కొరియర్, కార్గో బుకింగ్‌కు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఇంతకాలం కొరియర్ సెంటర్‌కు కానీ.. కార్గో బుక్కింగ్ పాయింట్‌కు వెళ్లి అక్కడ తమ పార్సల్స్ పంపించుకోవల్సి వచ్చేది. అయితే.. ఇప్పుడు నేరుగా నిర్ణీత ఆర్టీసీ బస్సులోనే కొరియర్, కార్గో బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించనుంది. ముందుగా మీరు కొరియర్ ఎక్కడికైతే పంపించాలో ఆ బస్సు వద్దకు వెళ్లి నేరుగా కండక్టర్ వద్దే పార్సిల్ బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకున్న తర్వాత వెంటనే పార్సిళ్లు గమ్యస్థానాలకు చేరుతాయి. దీని కోసం టిమ్ మెషిన్ల ద్వారా కొరియర్ బుకింగ్ చేయడం.. రశీదు ఇవ్వడం, ఇతర అంశాలపై కండక్టర్లకు ట్రైయినింగ్ ఇస్తున్నారు. కొరియర్ బుకింగ్ మొత్తాన్ని టికెట్ కలెక్షన్ల మొత్తంగా చూపించే వే బిల్లుతో కాకుండా విడిగా నమోదు చేస్తారు. కొరియర్ బుకింగ్‌లు బాగా చేసే కండక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా అందించాలని ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బస్సుల్లోనే కార్గో సేవల బుకింగ్‌ను ప్రయోగాత్మకంగా మొదటగా గుంటూరు జిల్లా ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. తర్వాత నెలరోజుల్లోనే దశలవారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో 94 ఆర్టీసీ బస్ స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లతోపాటు 422 మంది ఏజెంట్ల ద్వారా కొరియర్, కార్గో బుకింగ్ సేవలు అందిస్తున్నారు.ఏపీఎస్ ఆర్టీసీ రోజుకు సగటున 20,500 బుకింగ్‌ల ద్వారా రూ.40లక్షల రాబడి ఉంది. కాగా 2022?23లో రోజుకు సగటున 40వేల బుకింగ్‌లతో రూ.68లక్షలు రాబడి సాధించాలని టార్గెట్ పెట్టుకుంది. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.250కోట్లు రాబడి సాధించాలని భావిస్తోంది. రాష్ట్రంలో 672 మండలాల్లోని 14,123 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలు అందిస్తోంది.

## పవన్ ను తప్పుదారి పట్టిస్తున్నారా....

విజయవాడ, ఏప్రిల్ 8, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు రాజకీయ వ్యూహాలు కొరవడ్డాయనే చెప్పాలి. ఆయనను కొందరు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నట్లు జనసేన పార్టీలో చర్చ జరుగుతుంది. పవన్ తర్వాత స్థానంలో ఉన్న సదరు నేత ఇచ్చే రాంగ్ డైరెక్షన్ లో పవన్ పయనిస్తున్నారని, అది భవిష్యత్ లో పార్టీకి నష్టాన్ని చేకూరుస్తుందని జనసేన సీనియర్ నేతలు సయితం అభిప్రాయపడుతున్నారు. నిజానికి జనసేన ఆవిర్భావ సభలో చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. వైసీపీకి వ్యతిరేకంగా అందరినీ ఏకం చేస్తానని చెప్పడమూ బాగానే ఉంది. అదే సమయంలో రోడ్డు మ్యాప్ అంశం పార్టీని ఇరకాటంలోకి నెట్టిందంటున్నారు. నిజానికి బీజేపీపై పవన్ కల్యాణ్ ఇప్పటికీ ఆధారపడి ఉన్నారన్న సంకేతాలను ఇటు క్యాడర్ కే కాక ప్రజల్లోకి కూడా వెళ్లిపోయింది. ఇది పవన్ ఇమేజ్ ను ఖచ్చితంగా డ్యామేజీ చేసిందంటున్నారు. ఏపీలో ముఖ్యమంత్రి కావాల్సిన పవన్ కల్యాణ్ ఇక్కడ ఏమీ లేని పార్టీ చేతిలో పావుగా మారారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. భవిష్యత్ లో పవన్ బీజేపీ మిత్రత్వం నుంచి బయటకు వచ్చినా పవన్ కు పెద్దగా ప్లస్ అయ్యేదేమీ లేదంటున్నారు. మరోవైపు పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు విషయాన్ని ఇప్పటి నుంచే ప్రస్తావించడం పార్టీకి భారీ స్థాయిలో నష్టం చేకూరుస్తుందంటున్నారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్లు సమయం ఉంది.టీడీపీ నాయకత్వంపై నమ్మకం లేక అనేక మంది నేతలు ఇతర పార్టీల వైపు చూసే సమయం ఇది. అంటే జనసేనలో చేరికలు ఎక్కువగా ఉండే అవకాశముంది. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో టీడీపీ నుంచి ఎక్కువగా వలసలు ఉంటాయని అక్కడి జనసేన నేతలు అంచనా వేశారు. కానీ పవన్ టీడీపీతో పొత్తు ఉంటుందన్న సంకేతాలు బలంగా ఇస్తుండటంతో చేరికలు పూర్తిగా నిలిచిపోయాయి. జనసేన కోటా కింద వెళ్లే సీట్లలో తప్ప ఇంకెక్కడా హడావిడి కనిపించడం లేదు. పవన్ తనంతట తానుగానే చేరికలకు ఫుల్ స్టాప్ పెట్టేసుకున్నారన్న వ్యాఖ్యలు పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పార్టీలో సీనియర్ నేత నాదెండ్ల మనోహర్ కారణమంటున్నారు. ఆయన పవన్ కు తప్పుడు సలహాలు ఇవ్వడం వల్లనే ఇప్పటికే అనేక మంది నేతలు పార్టీని విడిచివెళ్లిన విషయాన్ని కూడా వారు గుర్తు చేస్తున్నారు.



# జగన్ లెక్కే వేరా



విజయవాడ, ఏప్రిల్ 8, ఏపీ సీఎం వైఎస్ జగన్ తన మంత్రివర్గాన్ని మార్చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మంత్రివర్గం మొత్తం రాజీనామా చేయగా.. వీరిలో నలుగురైదుగుర్ని తిరిగి కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం సీఎం జగన్ అధ్యక్షతన చివరిసారిగా మంత్రులతో కేబినెట్ భేటీ జరిగింది. అనంతరం మంత్రులంతా తమ పదవులకు రాజీనామా చేశారు. అసలు జగన్ మంత్రివర్గాన్ని మార్చేస్తుండటానికి కారణం ఏంటి..? ఈ వ్యూహం ఆయనకు ఎలా కలిసి వస్తుందని భావిస్తున్నారు..? 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 సీట్లను గెలుచుకొని అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్.. రెండున్నరేళ్ల తర్వాత మంత్రివర్గాన్ని పూర్తిగా మార్చేస్తానని అప్పట్లోనే చెప్పారు. ఇప్పుడున్న మంత్రులు మరో రెండున్నరేళ్లు మాత్రమే పదవుల్లో కొనసాగుతారని.. తర్వాత వారి స్థానాల్లో వేరే వారికి అవకాశం ఇస్తానని చెప్పారు. ఈ మాట చెప్పడం ద్వారా పదవుల నుంచి తప్పుకుంటున్న మంత్రులు అసంతృప్తితో ఉండకుండా ముందుగానే జగన్ జాగ్రత్త పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం జగన్ చరిష్మాతోనే వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చింది. కానీ అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రజల్లో వ్యతిరేకత లేకుండా జాగ్రత్తపడాలి. మళ్లీ గెలవడానికి జగన్ పాలన, మంత్రుల పనితీరే గీటురాయి కానుంది. అందుకే సీఎం జగన్ వ్యూహాత్మకంగా కేబినెట్‌ను మార్చేస్తున్నారని భావించొచ్చు.స్తుత మంత్రుల్లో కొందరి పనితీరు పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉంది. చేతల కంటే మాటలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం జనాల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వారిని మంత్రి వర్గం నుంచి తప్పించడం మినహా మరో మార్గం లేదు. నోటి దురుసు మంత్రులతో ప్రభుత్వానికి జరిగే మేలు కంటే నష్టం వాటిల్లే అవకాశాలే ఎక్కువ.కాగా, ఇంకొందరు మంత్రులు తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. ఇలాంటి వారిని కూడా మంత్రి వర్గం నుంచి తొలగించడం వెనుక కారణం లేకపోలేదు. ఇలాంటి వారి సేవలను పార్టీ కోసం వాడుకోవాలనేది జగన్ యోచన. 2024 అసెంబ్లీ ఎన్నికలు జగన్‌కు ప్రతిష్టాత్మకంగా మారనున్నాయి. రాబోయే

### అసంతృప్తి చల్లారుతుందా...?

ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గెలవడం కాదు భారీ మెజార్టీతో గెలవాలనే పట్టుదలతో జగన్ ఉన్నారు. కాబట్టి ఇప్పటి వరకూ మంత్రులుగా పని చేసిన వారు ఇక నుంచి పార్టీ కోసం పాటుపడాలనేది సీఎం విధించబోయే టార్గెట్. అందులో విజయం సాధించిన వారికే వైఎస్సార్సీపీ తిరిగి అధికారంలోకి వచ్చాక మళ్లీ మంత్రి పదవులు దక్కుతాయి.సాధారణంగా ఐదేళ్లు మంత్రులుగా పని చేసిన వారికి క్షేత్ర స్థాయి కార్యకర్తలు, సాధారణ ప్రజానీకంతో సంబంధాలు తగ్గిపోతాయి. అందుకే పార్టీ భారీ మెజార్టీతో గెలిచినప్పటికీ.. కొందరు మంత్రులు ఎన్నికల్లో ఓడిపోతుంటారు. ఇప్పుడు మంత్రి పదవులకు రాజీనామా చేస్తున్న నాయకులకు తిరిగి సాధారణ ప్రజానీకం, పార్టీ కార్యకర్తలకు దగ్గరయ్యే అవకాశం లభించినట్లే భావించాలి.ఇదే కేబినెట్‌ను ఐదేళ్లపాటు కొనసాగిస్తే.. 150 మంది ఎమ్మెల్యేల్లో కేవలం కొందరికే మంత్రులుగా అవకాశాలు ఇవ్వడం సాధ్యపడుతుంది. కానీ కేబినెట్ పదవి ఆశిస్తోన్న మిగతా సీనియర్ నేతలు అసంతృప్తికి లోనయ్యే అవకాశం ఉంది. ఇలాంటి వారికి అవకాశం ఇవ్వడం ద్వారా ఎక్కువ మందికి అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. అంతేకాదు ఎన్నికలు దగ్గర్లో ఉండటంతో మాటలు, చేతల విషయంలో కొత్త మంత్రులు ఆచితూచి వ్యవహరించే వీలుంది.స్థూలంగా చూస్తే.. ప్రజా వ్యతిరేకతను తగ్గించుకోవడం, ఆశావహులు అసంతృప్తి చెందకుండా చూడటం.. ప్రస్తుత సీనియర్ మంత్రుల్లో కొందరికి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు బాధ్యతలను అప్పగించడం అనేవి జగన్ వ్యూహాలుగా కనిపిస్తున్నాయి. మరి ఈ వ్యూహాలు వైఎస్సార్సీపీ తిరిగి అధికారంలోకి రావడానికి ఎంత వరకు ఉపయోగపడతాయో చూడాలి.

# ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేట్ ప్రాక్టీస్ ను రద్దుచేయడాన్ని స్వాగతిస్తున్నాం

### - జనచైతన్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

విజయవాడప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడం కోసం ప్రభుత్వ డాక్టర్లు చేస్తున్న ప్రైవేట్ ప్రాక్టీస్ ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని జనచైతన్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తుందని రాష్ట్ర కమిటీ అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు..ఈ నిర్ణయాన్ని అమలు కోసం సరైన విధి విధానాలను రూపొందించడానికి అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం చేస్తోంది.అత్యధిక మంది ప్రభుత్వ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రుల సమీపంలోనే ప్రైవేటు ఆసుపత్రులను ఏర్పాటు చేసుకుని ధనార్జనే ధ్యేయంగా పని చేయడాన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేట్ ప్రాక్టీస్ ను రద్దు చేయాలని నిర్ణయించడం హర్షణీయం. దాదాపు 14 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్నప్పటికీనీ ప్రభుత్వ డాక్టర్లు ఎక్కువ సమయం ప్రభుత్వ ఆసుపత్రులలో ఉండకుండా ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు అందించడం బాధాకరమని అన్నారు. .1983లోనే నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీస్ ను రద్దుచేసినప్పటికీని ఆచరణలో వివిధ కారణాలతో అమలు కాలేదు. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్యులను,వైద్య సిబ్బందిని గణనీయంగా నియమించి ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసినప్పటికీని ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్య వైఖరి ఫలితంగా రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు,కార్పొరేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్న పరిస్థితులను నివారించాలంటే తప్పకుండా ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీస్ ను వెంటనే రద్దు చేయాలి.ప్రభుత్వ ఆసుపత్రులలో పారిశుధ్యం సక్రమంగా ఉండటం, అవసరమైన మందులు అందుబాటులో ఉండటం, అత్యాధునిక వైద్య పరికరాలను అమర్చి సక్రమంగా పనిచేసేలా చూడటం ద్వారా మాత్రవే పేద ప్రజలకు,సామాన్యులకు ఆధునిక వైద్యాన్ని అందించినవారమౌతమని జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ భావిస్తుందని అయన అన్నారు.

## పార్వతీపురంలో జనపోరు యాత్ర

### జంఝావతి ప్రాజెక్టును సందర్శించిన బీజేపీ నేతలు

పార్వతీపురంభారతీయ జనతాపార్టీ అధ్వర్యంలో గురువారం చెపట్టిన జలం కోసం ఉత్తరాంధ్ర జనపోరు యాత్ర శుక్రవారం పార్వతీపురానికి చేరుకుంది. ఈ నేపధ్యంలో బిజెపి నేతలు. ఎంపీ జీవీఎల్, రాష్ట్ర ఇన్ చార్జి సునీల్ దేవ్ ధర్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సోము వీర్రాజు, ఎమ్మెల్సీ మాధవ్ ల వెంట స్థానిక నేతలు జంఝావతి ప్రాజెక్టు రబ్బరు డ్యామును సందర్శించారు. జగనన్న ఇళ్లకాలనీని బిజెపి బృందం దర్శించింది. ఒక ఇంటి వద్ద మోదీ ఫ్లెక్సీ పెట్టిన సోము వీర్రాజు, కేంద్ర నిధులతో కట్టిన ఇళ్ల వద్ద మోదీ ఫ్లెక్సీలు పెట్టి తీరాలని డిమాండ్ చేసారు. అక్కడ జరిగిన సభలొ నాయకులు ప్రసంగించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ జంఝావతి కెపాసిటీ నాలుగు టిఎంసిలు. 25 కోట్లతో పాతికవేల ఎకరాలు సాగవుతాయి. ఒడిసాతొ మాటాడి ఒప్పిస్తే మనకు 40 వేల ఎకరాలకు నీరు రావటమే కాక ఒడిసాకూ నాలుగు టిఎంసిలు దక్కుతాయని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గులేదు. ఈ చిన్న ఖర్చులకు ముఖం చాటేసి కేంద్రాన్ని మాత్రం పోలవరం ఖర్చు పెంచి ఇమ్మంటున్నారు. మేము పోలవరం నిర్మిస్తాం. మీకు ఈ చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలంటూ ఉద్యమిస్తామని అన్నారు.జిల్లా బిజెపి అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు ఏది అవసరమో తెలియని నాయకులు మాకు ఉండటం మా దురదృష్టం. ఈ జంఝావతికి 100 కోట్లు ఇస్తే ఈ ప్రాంత రైతులంతా లబ్ధిపొందుతారని అన్నారు.

# ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

### ధాన్యం కొనుగోలుపై గ్రామ గ్రామాన నిరసన రైతులు పండించిన యాసంగి వరి ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి

పెగడపల్లి రైతులు పండించిన యాసంగి వరి ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు, టిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని గ్రామ గ్రామాన ఇండ్ల వద్ద, గ్రామ పంచాయతీల వద్ద రైతులతో కలిసి టిఆర్ఎస్ నాయకులు నల్ల జెండాలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రైతులు పండించిన యాసంగి వరి ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ, వరి ధాన్యం కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని, లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి జడ్పిటీసి కాసుగంటి రాజేందర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి నాయక్, నందగిరి పిఎసిఎస్ చైర్మన్ కర్ర భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లోక మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న, సీనియర్ నాయకులు గోలి సురేందర్ రెడ్డి, తెరాస పార్టీ జిల్లా నాయకులు ఇరుగురాల ఆనందం, పుల్లూరి సత్యనారాయణ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు కోరుకంటి రాజేశ్వర్ రావు, గ్రామ సర్పంచులు ఉప్పులంచ లక్ష్మణ్, బాబు స్వామి, గాజుల రాకేష్, రవి నాయక్, మండల కో ఆప్షన్ మెంబర్ రహీం, టిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు సొల్లేటి సంతోష్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు నాగుల రాజశేఖర్ గౌడ్, ఉప సర్పంచులు చంద్రారెడ్డి, యాదనవేని తిరుపతి, సింగిల్ విండో డైరెక్టర్ సురేందర్ రావు, ఏఎంసి డైరెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, రమేష్, టిఆర్ఎస్ నాయకులు కరుణాకర్ రావు, ప్రవీణ్ రావు, బొమ్మెణ స్వామి, భోగ లక్ష్మీనారాయణ, పలుమారు విజయ్, సాయిని రవి, మల్లేష్ యాదవ్, జానీ పాషా, ఆత్మకూరి చందు, చిన్నం తిరుపతి, సురభి భాస్కర్ రావు, సాగి శ్రీనివాస రావు, మడిగెల తిరుపతి, బాలసాని శ్రీనివాస్, తిరుమణి నరసింహారెడ్డి, గంగాధర్, లింగ రెడ్డి, మోహన్ రెడ్డి, అర్జున్ రెడ్డి, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వుయ్యూరులో పలువురికి కంటి పరీక్షలు

వుయ్యూరుకృష్ణాజిల్లా వుయ్యూరు రోటరీ ఆడిటోరియంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం జరిగిందని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ అనీస్ తెలియజేశారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ వి.వి .రాజేష్ కుమార్ మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన అవ్వాతాతలు అందరూ కంటి సమస్యలతో బాధపడేవారు ఈ శిబిరం దగ్గరికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ వి.వి .రాజేష్ కుమార్, వార్డు కౌన్సిలర్ తెనాలి పద్మ, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ అనీస్, ఏఎన్ఎంలు పుష్ప, కుసుమ కుమారి,ఎశ్రీప్తజూ పావని, ఆశాలు,కుమారి,జ్యోతి, శంషాద్ బేగం పాల్గొన్నారు

## కురిక్యాలలో అనారోగ్యంతో ఉన్న వారి వివరాల సేకరణ

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో వైరల్ ఫీవర్ మరియు డెంగ్యూ జ్వరాలు వస్తున్నందున గ్రామంలో డ్రైనేజీ లో బ్లీచింగ్ మరియు హైడ్రోక్లోరైడ్ ద్రావణం పిచికారి చేయించడంతో పాటు గ్రామంలోని ఇండ్లలో వైద్య సిబ్బంది తిరుగుతూ జ్వరాలు వచ్చిన వారి ఇంటికి వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. మలేరియా డెంగ్యూ సంబంధించిన వైరల్ ఫీవర్ నమోనా శాంపిల్ తీసుకున్నారు. నమూనాలు సేకరించిన వారిలో ఒకరికి డెంగ్యూ ఫీవర్ వచ్చిందని వైద్య సిబ్బంది తెలియ చేసారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన్ రావు మరియు హెల్త్ సెంటర్ ఏఎన్ఎం పద్మావతి విజయ ఆశ వర్కర్లు రాధా,పలువురు వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్ధరాత్రి అరెస్టులు ఇదేక్కడి న్యాయం

### సీపీఐ జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్

నంద్యాల నంద్యాల జిల్లాకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారి పర్యటనలో భాగంగా అర్ధరాత్రి నుండి సిపిఐ ప్రజాసంఘాల నాయకులు అక్రమ అరెస్టు చేయడం అమానుషం. సిపిఐ నంద్యాల జిల్లా కేంద్రానికి వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి జిల్లా అభివృద్ధి కొరకు నంద్యాల సిపిఐ సూచించే సూచనలు వినతిపత్రం ద్వారా అందించేందుకు అవకాశం ఇవ్వకుండా గత అర్ధరాత్రి నుండి పార్టీ ప్రజా సంఘాల నాయకులను వారి వారి ఇళ్ల వద్దకు వెళ్లి బలవంతంగా జీపులో తరలించి అక్రమంగా అరెస్టు చేయడం అమానుషమని. పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యమా లేక పోలీసు రాజ్యమా అని ప్రశ్నిస్తూ ప్రజాతంత్ర వాదు లందరూ పోలీస్ చర్యలను ఖండించాలని అరెస్టయినవారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడుఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్. ఏ ఐ టి యు సి పట్టణ కార్యదర్శి. డి. శ్రీనివాసులు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. ధనుంజయుడు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి. సోమన్న. ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు భూమిని శ్రీనివాసులు.గోస్పాడు మండలంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం ఏ సుబ్బరాయుడు. హరినాథ్ లను అరెస్టు చేయడం జరిగిందని అన్నారు.

## కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బోయిన్ పల్లి మండలంలో ఇండ్లపై నల్ల జెండాలు ఎగురవేసిన టీ ఆర్ ఎస్ నాయకులు

చొప్పదండి తెలంగాణ వరి కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇండ్లపై నల్ల జెండాలు ఎగురవేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు,రైతులు తమ ఇండ్లపై శుక్రవారం నల్ల జెండా ఎరుగవేసి నిరసన వ్యక్తం చేశారు..అనంతరం తెరాస గ్రామ శాఖా అద్వర్యంలో బోయినిపల్లి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమంలో బీజేపీ దిష్టి బొమ్మను దహనం చేశారు..ఈ నిరసన కార్యక్రమంలో బోయినిపల్లి మండల కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆజ్జు, తెరాస నాయకులు గుంటి శంకర్,సాంబ లక్ష్మి రాజం, భీమనాథుని రమేష్,లంక సత్యనారాయణ రెడ్డి,నర్సక్క,మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనిల్ కుమార్,తెరాస గ్రామ అధ్యక్షులు బొజ్జ నరేష్,ఎస్ సి సెల్ మండల అధ్యక్షులు కన్నం సాగర్,ఉప సర్పంచ్ పిట్టల మోహన్, వార్డ్ మెంబర్లు తెరాస నాయకులు, రైతులు,యువకులు తదితరులు పాల్గొన్నారు..

### ఏప్రిల్ 10 నుండి శ్రీ కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు

తిరుపతి, ఏప్రిల్ 08తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 10వ తేదీ నుండి శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా మొదటిరోజు ఉదయం శ్రీరామనవమి సందర్భంగా మూలవర్లకు అభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీరామనవమి ఆస్థానం వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు హనుమంత వాహనంపై రాములవారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తారు.ఏప్రిల్ 11న శ్రీ సీతారాముల కల్యాణం ఏప్రిల్ 11వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు టిటిడి పరిపాలన భవనం నుండి ఏనుగుపై ముత్యాల తలంబ్రాల ఊరేగింపు జరుగనుంది. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. రూ.1000/- చెల్లించి టికెట్ కొనుగోలు చేసి గృహస్తులు కల్యాణంలో పాల్గొనవచ్చు. ఆ తరువాత తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్ 12న ఉదయం స్వామివారికి చతుర్దశ కలశ స్నపనతిరుమంజనం, రాత్రి 7 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తారు. రూ.1000/- చెల్లించి టికెట్ కొనుగోలు చేసి గృహస్తులు శ్రీరామపట్టాభిషేకంలో పాల్గొనవచ్చు.

# 10 మందికి మరో చాన్స్

విజయవాడ, ఏప్రిల్ 8, సీఎం జగన్ టీమ్ 24ని లాంచ్ చేయబోతున్నారు. ఇప్పటికే 24 మంది మంత్రులు రాజీనామాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందుతోంది. పాత టీమ్‌లో సీనియర్లను కొనసాగించేందుకు సీఎం రెడీ అయినట్లు తెలుస్తోంది. దాదాపు పది మంది వరకు మళ్లీ చాన్స్ దక్కే అవకాశాలున్నాయి. పనితీరు, కులాలు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో పాతవారికి కొనసాగించబోతున్నారు. పాతమంత్రులు కొనసాగే జాబితాలో.. పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, బొత్స సత్యానారాయణ, కొడాలి నాని, పేర్ని నాని, సీదిరి అప్పలరాజు, చెల్లుబోయిన వేణుగోపాల్, గుమ్మనూరు జయరాం, ఆదిమూలపు సురేష్, అంజాద్ బాషా, తానేటి వనిత ఉన్నట్లు తెలుస్తోంది. పాత టీమ్‌లో ఒకరిద్దరికే చాన్సులుంటాయని అంతా అనుకుంటున్న సమయంలో.. జగన్ తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. రాబోయే రెండేళ్లు చాలా కీలకం కాబట్టి.. కేబినెట్‌లో సీనియర్లు అవసరమనే యోచనలో సీఎం ఉన్నట్లు తెలుస్తోంది.మంత్రివర్గ మార్పుపై జోరుగా చర్చ జరుగుతున్న సమయంలో.. కొందరు నేతలు భేటీ కావడం కీలకంగా మారింది. సచివాలయంలో సజ్జలతో, బొత్స, అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు కన్నబాబు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌లో కొంత మంది అధికారులు కూడా పాల్గొనడం చర్చనీయాంశమైంది.మరోవైపు మంత్రులంతా రాజీనామా చేయడంతో సచివాలయంలోని మంత్రుల పేషీలన్నీ బోసిపోయి ఉన్నాయి. మంత్రుల ఛాంబర్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. మంత్రులు లేకపోవడంతో.. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే ప్రజలు కూడా సచివాలయం పరిసరాల్లో లేరు. అధికారుల హడావుడి.. కూడా తగ్గిపోయింది. సీఎం జగన్ కొత్త టీం ఎలా ఉండబోతుంది.. ఏ శాఖకు ఎవరు మంత్రిగా వస్తారనే ఆసక్తితో అందరూ ఎదురుచూస్తున్నారు.

# తిరుమలలో భారీగా రద్దీ



తిరుపతి, ఏప్రిల్ 8,హిందువుల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి. శ్రీవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశ విదేశాల నుంచి భక్తులు వస్తారు. స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకుంటారు. కరోనా వెలుగులోకి వచ్చిన అనంతరం రెండేళ్ల తర్వాత సాధారణ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో తిరుమల ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. ముఖ్యంగా సర్వ దర్శనం పునః ప్రారంభించిన అనంతరం తిరుమల క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మార్చి నెలలో కోనేటిరాయుడిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, హుండీ కానుకల వివరాలను టీటీడీ ప్రకటించింది. వివరాల్లోకి వెళ్తే..మార్చిలో 19.72 లక్షల మందికి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. మార్చి నెలలో స్వామి వారి హుండీ కానుకల ద్వారా వచ్చిన ఆదాయం మొత్తం రూ.128.64 కోట్లు. 9.54 లక్షల మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. 24.10 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. 1.11 లక్షల లడ్డూలను భక్తులకు పంపిణీ చేశారు. 486.52 ఎమ్ఎల్ డి నీటిని వినియోగించారు. 36.06 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగించారు. 8,028 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించారని టీటీడీ అధికారులు వివరించారు. మరోవైపు నేటి నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి ప్రత్యేక దర్శన టికెట్లను రిలీజ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

# వర్క్ ఫ్రమ్ ఆఫీసు అంటున్న ఐటీ కంపెనీలు

హైదరాబాద్, ఏప్రిల్ 8, (న్యూస్ పల్స్) కరోనా కారణంగా ఇన్నాళ్లు బోసిపోయిన ఐటీ కారిడార్.. ఇప్పుడిప్పుడే సందడిగా మారుతోంది. దీంతో హైదరాబాద్ నగరంలోని అద్దె ఇండ్లకు, హాస్టళ్లకు డిమాండ్?పెరుగుతోంది. కరోనా తో రెండేళ్లుగా ఐటీ ఉద్యోగులు వర్క్ ?ఫ్రమ్ హోమ్‌లో ఉన్నారు. దీంతో హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్, ఐటీ ఆఫీసులు ఖాళీగా కన్పించాయి. ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితి మారుతోంది. వర్క్ ఫ్రమ్ ఆఫీసుతో హైటెక్ సిటీలోని సాఫ్ట్ వేర్ కంపెనీలు మళ్లీ సందడిగా కనిపిస్తున్నాయి. కరోనా సమయంలో ఆఫీసులు బంద్?పెట్టకపోయినా ఉద్యోగులకు మాత్రం వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించాయి. దీంతో చాలా మంది సొంతూళ్లకు వెళ్లి అక్కడి నుంచే వర్క్ ?చేస్తున్నారు. ఇటీవల కేంద్రం కూడా కొవిడ్? గైడ్?లైన్స్?లో మార్పులు చేయడంతో తిరిగి ఐటీ కంపెనీలు ఉద్యోగులను ఆఫీసులకు రప్పించేందుకు నిర్ణయించాయి. రిటర్న్ టు కంపెనీ లెటర్స్ కూడా పంపించాయి. కొన్ని కంపెనీలు ఏప్రిల్ ఒకటి నుంచి, మరికొన్ని 4 నుంచి, ఇంకొన్ని 11 నుంచి ఉద్యోగులు ఆఫీసులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాయి.హైదరాబాద్‌లో కోవిడ్ తగ్గినప్పటికీ ఐటీ ఎంప్లాయిస్ కేవలం 10 నుంచి 20 శాతం వరకే ఆఫీస్‌కి వస్తున్నారు. వచ్చే 6 నెలల్లో కనీసం 50 శాతం వరకు ఐటీ ఎంప్లాయిస్ ఆఫీసుకి రావాలని కోరుతోంది ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్. ఐటీ రంగం తప్పితే రాష్ట్రంలో అన్నీ మామూలుగానే సాగుతున్నాయి. కేవలం ఐటీ రంగం మాత్రమే ఇంకా ఆఫీస్‌కి రాకుండా, వర్క్ ఫ్రంహోంలో నడుస్తోంది. అటు భవిష్యత్తులో మళ్లీ కొవిడ్ వస్తే, తగిన జాగ్రత్తలు తీసుకుంటామని అంటున్నాయి కంపెనీలు. ఐటీ రంగంలో ఎంప్లాయిస్ ఆఫీస్‌కి రావడం వల్ల, ఆరు లక్షల మందికి చిన్నచిన్న ఉద్యోగాలు వస్తాయని అంటున్నారు నిపుణులు.

## ఒంటిమిట్ట శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి, ఏప్రిల్ 08 ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 10 నుండి 18వ తేదీ వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా టిటిడి ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆకట్టుకునేలా ధార్మిక, సంగీత, సాహిత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ధార్మికోపన్యాసం, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఊంజల్‌సేవలో భక్తి సంగీతం, రాత్రి 7 నుండి 9 గంటల వరకు హరికథ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం, రాత్రి వాహనసేవల్లో కళాబృందాల సభ్యులు ః భజనలు, కోలాటాలు తదితర కళారూపాలను ప్రదర్శిస్తారు.కవి సమ్మేళనం, సాహితీ సదస్సు... ఏప్రిల్ 10న బమ్మెర పోతన జయంతి సందర్భంగా ఆలయం వద్ద మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహిస్తారు. ఏప్రిల్ 11న శ్రీరామపట్టాభిషేకం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాహితీ సదస్సు జరుగనుంది.ఏప్రిల్ 15న కల్యాణోత్సవం రోజున ప్రత్యేక కార్యక్రమాలు... ఏప్రిల్ 15న కల్యాణోత్సవం సందర్భంగా కల్యాణ వేదిక వద్ద సాయంత్రం 4 నుండి 4.30 గంటల వరకు ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో నాదస్వర వాద్యం, సాయంత్రం 4.30 నుండి 5 గంటల వరకు ఎస్వీబీసీ అదివో అల్లదివో కార్యక్రమం కళాకారులతో భక్తిసంగీతం, సాయంత్రం 5 నుండి 5.30 గంటల వరకు ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులతో నామసంకీర్తనం, సాయంత్రం 5.30 నుండి 6.15 గంటల వరకు ఎదుర్కోలు, సాయంత్రం 6.15 నుండి 7.45 గంటల వరకు తమిళనాడుకు చెందిన శ్రీ విఠల్‌దాస్ మహరాజ్ బృందం నామసంకీర్తనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య చక్రవర్తి రంగనాథన్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా. ఆకెళ్ల విభీషణశర్మ కల్యాణోత్సవానికి ప్రత్యేకంగా వ్యాఖ్యానం చేస్తారు

## గోపినగర్ కాలోనిలో అంగన్వాడీ కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన గౌరవ కార్పొరేటర్ శ్రీ రాగం నాగేందర్ యాదవ్ గారు.



శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోగల గోపినగర్ కాలోనీలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గారి సొంత ఖర్చులతో స్థానిక వాసుల సంక్షేమానికి నిర్మాణం చేపట్టిన భవనంలో నూతన అంగన్వాడి కేంద్రాన్ని ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీబాయి గారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించినారు. అనంతరం కార్పొరేటర్ గారు మాట్లాడుతు నా సహకారము ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు.కార్పొరేటర్ గారు, ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీబాయి గారు కలిసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.అనంతరం అంగన్వాడీ కేంద్రం పనితీరును పరిశీలించేందుకు అంగన్వాడీ కేంద్రంలోని మెనూ ప్రకారం పిల్లలకు పెట్టే ఆహారం నాణ్యతను, అలాగే అంగన్వాడీ కేంద్రంలోని టీచర్ పిల్లలకు బోధించే విధానాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు.గర్భిణీలకు, బాలింతలకు వ్యాధినిరోధక శక్తిని పెంచేందుకు నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని తెలిపారు. చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి అశ్రద్ధ వహించారాదని అంగన్వాడీ నిర్వాహకులకు సూచించారు.కార్పొరేటర్ సొంత ఖర్చులతో భవన నిర్మాణాన్ని చేపట్టి అంగన్వాడీ కేంద్రానికి భవనాన్ని అందుబాటులోకి తెచ్చినందుకు ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీబాయి గారు, చిన్నారుల తల్లిదండ్రులు కార్పొరేటర్ గారికి కృతజ్ఞతలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు దుర్గం వీరేశం గౌడ్ గారు, ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీబాయి గారు, సూపర్వైజర్ జ్యోతి శ్రీ గారు, యాద గౌడ్, కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, పర్వీన్ బేగం, గోపాల్ యాదవ్, శ్రీకాంత్, బస్వరాజ్, కె దివాకర్ రెడ్డి, జమ్మయ్య, రామ్ చందర్, అంగన్వాడీ టీచర్ నాగరాణి, తదితర అంగన్వాడీ టీచర్స్, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలను జిల్లా చేయడంతో సరిపోదు

### అభివృద్ధి కూడా చేయాలి సీపీఐ , టియన్ యస్ యఫ్ , బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం



నంద్యాల ( విభారె ) :- నంద్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు వివిధ రకాల వామపక్ష పార్టీలు విద్యార్థి సంఘాలు ప్రభుత్వం పై తీవ్రంగా మండిపడ్డారు. అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవని అన్నారు . నంద్యాల జిల్లా అభివృద్ధి కి సీయం జగన్ మోహన్ రెడ్డి కి వినతిపత్రం ఇవ్వకుండా అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. సిపిఐ పట్టణ ప్రధాన కార్యదర్శి కె ప్రసాద్ , బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వోంకిరి రామచంద్రుడు , తెలుగుదేశం పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎన్ఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షులు ముద్దనీ నాగ నవీన్ , బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ మాట్లాడుతూ నంద్యాల కు వస్తున్న ముఖ్యమంత్రి గారికి రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య అల్లాడిపోతున్న నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని , అలాగే నంద్యాల అభివృద్ధికి ఉపయోగపడే వినతులను అందించాలని అనుకోవటం జరిగిందన్నారు. కానీ ఈ రకంగా ఉద్యమాలను అర్ధరాత్రి ఇంటి దగ్గరకు వచ్చి స్టేషన్ కి తరలించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. గతంలో వచ్చిన ముఖ్యమంత్రులకు సమస్యలపై వినతులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి గారు నియంత పోకడలతో వ్యవహరిస్తూ పోలీసు అధికారులతో ఉద్యమాలను అనగా తొక్కాలని చూడడం చాలా సిగ్గుచేటు అనిపిస్తుందని అన్నారు , అలాంటి ప్రయత్నం వెంటనే మానుకోవాలని ఎందుకంటే ఉద్యమకారులు బంతి లాంటి వారు ఎంత కిందకు కొడితే అంత పైకి ఎగురుతారు అని తెలుసుకోవాలని వారు అన్నారు . కావున ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు వెంటనే నంద్యాల పట్టణ సమస్యలను అదేవిధంగా విద్యార్థి నిరుద్యోగ సమస్యను తీర్చాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

## ఆర్డిటి సేవలు మరువలేనివి జిల్లా ఉపాధ్యక్షుడు



కౌతాళం ఆర్ డి టి సేవలు మరువలేనివి అని ఎన్నో నీరు పేద కుటుంబ లకు చేయూత ఇచ్చారని విద్యార్థుల కు స్కాలర్ షిప్ లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఒక ఎత్తు అయితే ఆర్ డి టి సేవలు నిరుపేదలకు ఓ వరం లాంటిదని నిరుపేదలు చాలా మంది లబ్ధి పొందారని వారి సేవలు మరువలేనివని చన్న బసప్ప రైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకట పతి రాజు పేర్కొన్నారు. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక నివాసంలో ఆనంద్ రాజుకు పదివేల రూపాయలు విరాళంగా అందించారు. గాడ్ ఫాదర్ విన్సెంట్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారి సేవలు నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజనంద్ ఐ టిడిపి ఉపాధ్యక్షులు మంజునాథ్ నరసప్ప, రాజబాబు, గాబ్రియల్ జైపాల్ ,తదితరులు ఉన్నారు

### రైస్ కు బదులుగా జొన్నలు,లేక రాగులు, గోదుమలు ఇవ్వాలి

ఎ. బ్రహ్మయ్య నంద్యాల జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు

నంద్యాల :- ప్రభుత్వం వారు నిత్యావసర సరుకులను రేషన్ షాపు ద్వారా అందిస్తున్న బియ్యానికి బదులుగా జొన్నలు. కానీ రాగులు. లేక గోధుమలు పంపిణీ చేస్తే బాగుంటుందని నంద్యాల జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు ఎ. బ్రహ్మయ్య అన్నారు. వారు శుక్రవారం నాడు ఓ ప్రకటనలో మాట్లాడుతూ గత ప్రభుత్వం వారు ఉచిత బియ్యానికి బదులుగా కొన్ని మాసాలుగా జొన్నలు. రాగులు ఇచ్చారని గుర్తు చేశారు . అలాగే ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం వారు ఉచిత బియ్యానికి బదులుగా జొన్నలు. కానీ రాగులు లేక గోధుమలు అందిస్తే బాగుంటుందని సూచించారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 11 12 13 తేదీలలో నిరసనలు

బద్వేలు ( విభారె) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఈనెల 11 12 13 తేదీలలో చేపట్టిన నిరసన ఆందోళన కార్యక్రమాలలో పెద్ద ఎత్తున ప్రజలందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీర శేఖర్ పిలుపునిచ్చారు శుక్రవారం ఉదయం బద్వేల్ సిపిఐ కార్యాలయం జేబీ భవనము నందు జరిగిన బద్వేలు పట్టణ శాఖా కార్యదర్శులు ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రెండోసారి కేంద్రంలో మరియు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అనేక రూపాలలో పన్నులు విధించి తమ ఖజానాను నింపుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నాయని వారు ఎద్దేవా చేశారు కేంద్ర ప్రభుత్వం మేమిద్దరం మాకిద్దరు అనే రీతిలో అంబానీ ఆదాని సేవలో మునిగితేలుతూ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ వారి పరం చేస్తూ పేద మధ్యతరగతి ప్రజల రక్తాన్ని ధరల పెంపు పేరుతో పీల్చుతూ ఉన్నాయని అలాగే రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం ఇక్కడ మాత్రం కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నట్లు నటిస్తూ రూపాయి కారిగా వారి నిర్ణయాలను అమలు పరిచి పేద మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచే బిజెపి ప్రభుత్వం విధానాలకు ఆమోదం తెలుపుతూ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని వారు ఘాటుగా విమర్శించారు ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల వంటనూనెల డీజిల్ పెట్రోల్ ధరలతో ప్రజలు సతమతమవుతుంటే నేడు రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల పెంపును ప్రకటించడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉన్నదని వారు విమర్శించారు ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ధరల పెంపును నిరసిస్తూ ఈ నెల 11 12 13 తేదీలలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రచార ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని ఈ కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములై తమ ఆవేదనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వెళ్లేలా తమ నిరసనను తెలియజేయాలని వారు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సిపిఐ బద్వేలు ఏరియా కార్యదర్శి జకరయ్య పట్టణ కార్యదర్శి చంద్ర మోహన్ రాజు నాయకులు రామరాజు సంజీవ్ బాబు పీవీ రమణ వెంకటరమణ విజయమ్మ చెన్నయ్య పెంచలయ్య ఇమ్మానియేల్ నాగేష్ కదిరయ్య సుబ్బరాయుడు సుబ్బారెడ్డి నవనీతమ్మ తదితరులు పాల్గొన్నారు



# కేజీఎఫ్ 2 : యూఎస్ లో తెలుగు ప్రేక్షకుల క్లీయర్ కట్ డామినేషన్




కన్నడంలో తెరకెక్కిన కేజీఎఫ్ 2 ను దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈనెల 14న పాన్ ఇండియా రేంజ్ లో విడుదల కాబోతున్న ఈ సినిమా యూఎస్ వసూళ్ల కాస్త ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు కేజీఎఫ్ 2 కోసం భారీ ఎత్తున అడ్వాన్స్ బుకింగ్ జరిగింది. ప్రీమియర్ షో లతో పాటు రెగ్యులర్ షో ల కోసం యూఎస్ లో పెద్ద మొత్తంలో అడ్వాన్స్ బుకింగ్ జరుగగా అందులో మెజార్టీ వాటా తెలుగు ప్రేక్షకుల నుండి కావడం విశేషం.యూఎస్ లో ఈ సినిమాను కన్నడంతో పాటు హిందీ.. తెలుగు.. తమిళం మరియు మలయాళంలో కూడా విడుదల చేయబోతున్నారు. అన్ని భాషలకు చెందిన అడ్వాన్స్ బుకింగ్ లను ప్రారంభించారు. అక్కడ మెజార్టీ స్థాయిలో అంటే ఏకంగా 85 శాతం అడ్వాన్స్ బుకింగ్ తెలుగు వర్షన్ కు అయ్యింది. కేవలం 15 శాతం బుకింగ్ కన్నడం మరియు ఇతర భాషల ప్రేక్షకులు చేసుకున్నారు.కన్నడ సినిమా అయినా కూడా కేజీఎఫ్ 2 కు మంచి ఆధరణ యూఎస్ లో ఉంది. అయితే అది తెలుగు ప్రేక్షకుల నుండి అవ్వడం విడ్డూరంగా ఉందంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో కేజీఎఫ్ 2 సినిమా చూడాలని భావిస్తున్న వంద మంది లో 85 మంది మన తెలుగు వారే ఉండటం చూస్తుంటే తెలుగు ప్రేక్షకులు యూఎస్ లో ఏ స్థాయిలో డామినేషన్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.ఇటీవల తెలుగు ప్రేక్షకులు యూఎస్ లో రాధేశ్యామ్ మరియు ఆర్ ఆర్ ఆర్ లను చూశారు. ముఖ్యంగా జక్కన్న మూవీ ఆర్ ఆర్ ఆర్ ను యూఎస్ లోని తెలుగు ప్రేక్షకులు ఓ రేంజ్ లో చూశారు. రికార్డు బ్రేకింగ్ వసూళ్లు నమోదు అయ్యాయి. నెల గ్యాప్ కూడా లేకుండా రాబోతున్న కేజీఎఫ్ ను కూడా తెలుగు ప్రేక్షకులు యూఎస్ లో చూసేందుకు పెద్ద ఎత్తున అడ్వాన్స్ బుకింగ్ ను చేసుకోవడం ఆశ్చర్యంగా ఉంది.యూఎస్ లో అన్ని భాషలకు చెందిన వారు ఉన్నారు. కాని తెలుగు ప్రేక్షకులు సినిమా అంటే ఎంతటి అభిమానం ఉందో కేజీఎఫ్ 2 కు నమోదు అవుతున్న అడ్వాన్స్ బుకింగ్ వసూళ్లను చూస్తుంటే అర్థం అవుతుంది. కన్నడం లో రూపొందిన ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వర్షన్ కు ఈ స్థాయిలో వసూళ్లు నమోదు అవుతున్నాయి అంటే కాస్త పాజిటివ్ టాక్ ను దక్కించుకుంటే ఖచ్చితంగా రికార్డు లు నమోదు చేయడం ఖాయం అంటున్నారు.కేవలం యూఎస్ లో మాత్రమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కూడా కేజీఎఫ్ 2 సినిమా కుమ్మేయబోతుంది. కాస్త సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే కర్ణాటకలో ఏ స్థాయిలో అయితే వసూళ్లు దక్కించుకుంటుందో ఇక్కడ అంతకు మించిన వసూళ్లు దక్కించుకునే అవకాశాలు లేకపోలేదు అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాదిన కూడా కేజీఎఫ్ 2 సినిమా కు భారీగా వసూళ్లు నమోదు అవ్వబోతున్నాయి.ఉత్తర భారతంలోని పలు ముఖ్య పట్టణాల్లో తెలుగు వర్షన్ కోసం అడ్వాన్స్ బుకింగ్ జరుగుతుంది. మొత్తానికి తెలుగు ప్రేక్షకులు అక్కడ ఇక్కడ క్లీయర్ కట్ డామినేషన్ ను కేజీఎఫ్ 2 వసూళ్ల పై చూపించబోతున్నట్లుగా ఈ అడ్వాన్స్ బుకింగ్స్ ను చూస్తుంటే అనిపిస్తుంది అంటూ నెట్టింట చర్చ జరుగుతోంది. కేజీఎఫ్ 1 సూపర్ హిట్ అయిన కారణంగా కేజీఎఫ్ 2 బ్లాక్ బస్టర్ హిట్ ఖాయం అనే నమ్మకం వ్యక్తం అవుతోంది.


## నిర్మాతగా 'ఫుల్ బాటిల్' ఎత్తిన వర్సటైల్ యాక్టర్..!

కెరీర్ ప్రారంభంలో చిన్న చిన్న పాత్రల్లో నటించిన.టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్.. ఇప్పుడు హీరోగా వరుస సినిమాలతో బిజీగా మారిపోయాడు. వైవిధ్యమైన కథలు విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో ఫుల్ బిజీగా ఉన్న హీరోల్లో ఒకరైన సత్యదేవ్.. ఇప్పుడు ప్రొడ్యూసర్ అవతారమెత్తాడు.ఇటీవల కాలంలో అనేక మంది హీరోలు ఓవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు నిర్మాణంలో భాగస్వాములుగా ఉంటున్నారు. ఇప్పుడు సత్యదేవ్ 'హఠ కంపెనీ' అనే ప్రొడక్షన్ హౌస్ ని ప్రారంభించి సినిమాలు నిర్మించడం మొదలు పెట్టాడు. తాజాగా ఈ బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.1 గా రూపొందుతున్న చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు.సత్యదేవ్ స్వీయ నిర్మాణంలో "ఫుల్ బాటిల్" అనే సినిమా తెరకెక్కుతోంది. శరణ్ కొప్పిశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఫుల్ బాటిల్' సినిమాలో 78.1 % వినోదం.. 21.9% యాక్షన్ ఉంటుందని సత్యదేవ్ పేర్కొన్నారు. ఈరోజు బుధవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఇదే క్రమంలో టైటిల్ పోస్టర్ ని ఆవిష్కరించారు.ఒక ఆటోలో డ్రైవింగ్ సీట్ లో అబ్బాయి.. బ్యాక్ సీట్ లో అమ్మాయి కూర్చొని ఉండగా.. ఆటో పైన ఒక మందు సీసాలో "ఫుల్ బాటిల్" టైటిల్ డిజైన్ చేయబడింది. అలానే బ్యాగ్రౌండ్ లో కాకినాడ పోర్టు.. ఓ గ్రామం.. ఓ గుడి.. వంటివి ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ కామెడీ ఎంట ర్టైనర్ లో సత్యదేవ్ ఒక తాగుబోతుగా కనిపించను న్నాడు.దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి ఇది వరకు సత్యదేవ్ తో 'తిమ్మరుసు' అనే సినిమా తెరకెక్కించాడు. అంతకు ముందు నిఖిల్ తో 'కిర్రాక్ పార్టీ' సినిమా చేసిన శరన్.. 'గాలివాన' అనే వెబ్ మూవీతో రాబోతున్నాడు. ఈ క్రమంలో ఇప్పుడు సత్యదేవ్ తో "ఫుల్ బాటిల్" సినిమా రూపొందిస్తున్నాడు.శర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ లో రామాంజనేయులు జవ్వాజి తో కలిసి సత్యదేవ్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. సుజాత సిద్దార్థ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. సంతోష్ కామిరెడ్డి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించనున్నారు. మరి 'ఫుల్ బాటిల్' సినిమాతో నిర్మాతగా మారుతున్న సత్యదేవ్.. తొలి ప్రయత్నంలో ఫుల్ ప్రాఫిట్స్ అందుకుంటారో లేదో చూడాలి.



# రాజమౌళి ఒక హీరోతో ఒకరి చరిత్రనే తీస్తే బాగుండేదేమో!

తెలుగు సినిమా ఇండస్ట్రీలోని సీనియర్స్ లో తమ్మారెడ్డి భరద్వాజ ఒకరు. ఆయా సినిమాలపై .. ఇండస్ట్రీకి సంబంధించిన సమస్యలపై ఆయన స్పందిస్తూ ఉంటారు. తన మనసులోని మాటను ముక్కుసూటిగా చెప్పేయడం ఆయనకి అలవాటు. తాజా ఇంటర్వ్యూలో ఆయన 'ఆర్ ఆర్ ఆర్' సినిమాను గురించి ప్రస్తావించారు. ఈ సినిమా టిక్కెట్ల ధరలు పెంచడం .. కథను ఎంచుకున్న విధానం గురించి ఆయన కాస్త అసహనాన్ని .. అసంతృప్తిని వ్యక్తం చేశారు.తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ .. 'ఆర్ ఆర్ ఆర్' సినిమాను తొలి రోజునే ఇంతమంది చూశారు .. ఇంత వసూలు చేసిందని చెబుతున్నారు. కానీ ఇక్కడి జనాభా మొత్తం 3 కోట్లమంది ఉన్నప్పుడే 'లవ కుశ' సినిమాను కోటి 75 లక్షల మంది చూశారు. 'ఆర్ ఆర్ ఆర్' టిక్కెట్ల రేటు భారీగా పెంచేసి అమ్మారు. సినిమాలో దమ్ములేదని తెలిసి .. వాళ్లకే నమ్మకం లేక .. హైప్ ఇచ్చేసి వీలైనంత మొత్తం రాబట్టాలనే ఆలోచన కరెక్ట్ కాదు. రేటు తక్కువ ఉన్నా అవే డబ్బులు వచ్చేవి .. కాకపోతే కాస్త ఆలస్యమయ్యేది.కథను దాటిపోయి ఖర్చు చేస్తూ .. టిక్కెట్లు రేటు పెంచమనడం కరెక్ట్ కాదని నా ఉద్దేశం. నిజానికి రాజమౌళి గొప్ప దర్శకుడు. ఆయన కొమరం భీమ్ కథ తీసినా అల్లూరి సీతారామరాజు సినిమా తీసినా ఇంతే సక్సెస్ అయ్యేది. అలా కాకుండా ఇద్దరి పాత్రలను కలిపేసి ఒక సినిమా తీయడం కరెక్ట్ కాదు.చరిత్ర తెలియని వాళ్లు అల్లూరి .. కొమరం కలిసి ఆడుకున్నారేమోనని అనుకునే అవకాశం ఉంది. ఈ ఇద్దరి చరిత్రలు కొంతలో కొంత అందరికీ తెలుసు. అలాంటి ఒక చరిత్రను వక్రీకరించడానికి ప్రయత్నించకూడదు. ఒకరి చరిత్రనే తీసుకుని ఒక హీరోతోనే చేసి ఉంటే ఇంతకన్నా ఎక్కువ డబ్బులు వచ్చేవి. రాజమౌళి గారు ఒక సినిమా మొదలుపెట్టారంటే ఒక్క నిమిషం కూడా వేస్టు చేయరు. ఆ సినిమా రిలీజ్ అయ్యేవరకూ 24 గంటలు పనిచేస్తూనే ఉంటారు. రాజమౌళి ఒక చోట మాట్లాడుతూ .. ఒక్క ఫ్రేమ్ కూడా వేస్టు కాకుండా తీస్తానని చెప్పారు.ఆలా చేసినప్పుడు ఇంత ఖర్చు ఎందుకు అవుతుంది? ఇంత కాలం ఎందుకు పడుతుంది? పాన్ ఇండియా అయిపోయిందని చెప్పేసి హీరోలు పారితోషికం పెంచేసుకుంటూ పోయారు. ఆ తరువాత సినిమా నుంచి కూడా వాళ్లు అదే పారితోషికం కంటిన్యూ చేస్తారు. ఆ ప్రభావం టిక్కెట్ల రేటుపై పడుతోంది. హీరోలు తమ అభిమానులను గురించి ఆలోచించవలసిన అవసరం ఉంది" అని చెప్పుకొచ్చారు.



# ఆ క్రికెటర్ తాగిన మైకంలో నన్ను... చహల్ షాకింగ్ కామెంట్స్.. చచ్చేవాడిని!



"నిజానికి ఈ విషయం కొంతమందికి మాత్రమే తెలుసు. 2013లో ఈ ఘటన జరిగింది. అప్పుడు నేను ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్నాను. బెంగళూరులో మ్యాచ్ ఆడాము. ఆ తర్వాత హోటల్‌కు చేరుకున్నాం. నా సహచర ఆటగాడు ఒకరు బాగా తాగేసి ఉన్నాడు. తాగిన మైకంలో నన్ను తన దగ్గరకు పిలిచాడు. ఒక్కసారిగా నన్ను ఎత్తిపట్టుకుని బాల్కనీ నుంచి వేలాడదీశాడు. తన చుట్టూ నేను చేతులు వేసి పట్టుకుని ఉన్నాను. ఏమాత్రం పట్టు కోల్పోయినా 15వ అంతస్తు నుంచి కిందపడిపోయే వాడినే. అప్పటికే చాలా మంది అక్కడికి చేరుకున్నారు. నన్ను ఆ విపత్కర పరిస్థితి నుంచి బయటపడేశారు. స్పృహ కోల్పోయిన నాకు నీళ్లు ఇచ్చి కుదుటపడేలా చేశారు" అని టీమిండియా ఆటగాడు, రాజస్తాన్ రాయల్స్ స్టార్ బౌలర్ యజువేంద్ర చహల్ తనకు ఎదురైన చేదు అనుభవం గురించి పంచుకున్నాడు. సహచర ఆటగాళ్లు రవిచంద్ర అశ్విన్, కరుణ్ నాయర్‌తో కలిసి తన జీవితంలో జరిగిన దుర్ఘటనను, అందులో నుంచి బయటపడిన తీరును వివరించాడు. బయటకు వెళ్లినపుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, లేనిపక్షంలో ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుందని చహల్ చెప్పుకొచ్చాడు.తాను అతిపెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డాడని, తనకు అదొక పునర్జన్మ లాంటిదని పేర్కొన్నాడు. దయచేసి అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశాడు. అయితే తనకు ఆ పరిస్థితి కల్పించిన క్రికెటర్ ఎవరన్న విషయాన్ని మాత్రం చహల్ బయటపెట్టలేదు.ఇందుకు సంబంధించిన వీడియోను రాజస్తాన్ రాయల్స్ తమ సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. కాగా 2013 తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టులోకి వచ్చిన చహల్ చాలా కాలం పాటు ఆ ఫ్రాంఛైజీతోనే కొనసాగాడు. అయితే, ఐపీఎల్ మెగా వేలం-2022 నేపథ్యంలో ఆర్సీబీ అతడిని రిటైన్ చేసుకోలేదు. దీంతో రాజస్తాన్ చహల్‌ను కొనుగోలు చేసింది. ఇక ఈ సీజన్‌లో రాజస్తాన్ గెలిచిన రెండు మ్యాచ్‌లలో చహల్ తన వంతు పాత్ర పోషించాడు.

### ధర రెం లక్షలు.. మొన్నటి దాకా బెంచ్‌కే పరిమితం.. కీలక వికెట్ తీసి.. అప్పై

కృష్ణప్ప గౌతమ్.. ఐపీఎల్-2021 మినీ వేలంలో భాగంగా ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడుపోయిన భారత అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. చెన్నై సూపర్ కింగ్స్ అనూహ్యంగా రికార్డు ధర 9.25 కోట్లకు అతడిని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, మెగా వేలం-2022లో మాత్రం అతడికి నామమాత్రపు ధర దక్కింది. కోల్‌కతా, ఢిల్లీ ఫ్రాంఛైజీలు ఈ కర్ణాటక బౌలింగ్ ఆల్‌రౌండర్‌పై ఆసక్తి చూపగా... కొత్త జట్టు లక్నో సూపర్‌జెయింట్స్ 90 లక్షలు ఖర్చు చేసి అతడిని కొనుగోలు చేసింది. కానీ.. లక్నో జట్టు ఆడిన తొలి మూడు మ్యాచ్‌లలో గౌతమ్‌కు ఆడే అవకాశం రాలేదు. గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్‌కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ఈ టీమిండియా ఆటగాడు బెంచ్‌కే పరిమితమయ్యాడు.అయితే, ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు మనీశ్ పాండే స్థానంలో గౌతమ్ జట్టులోకి వచ్చాడు. లక్నోకు కొరకరాని కొయ్యగా మారి బౌండరీలతో విరుచుకుపడ్డ ఢిల్లీ ఓపెనర్ పృథ్వీ షా(34 బంతుల్లో 61 పరుగులు- 9 ఫోర్లు, రెండు సిక్సర్లు)ను పెవిలియన్‌కు పంపి బ్రేక్ ఇచ్చాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190